కత్తిమీద గీతలు

సికిందర్

తలుపు తీసి లాల్ లోపల శవాన్ని చూశాడు.

దుర్వాసనకి కర్చీఫ్ అడ్డుపెట్టుకొని అతను గదిలోకి వెళ్ళాడు.

వెనుక జాన్, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్, సార్జెంట్ నవీన్, డాక్టర్ రఘునాథ్ వెళ్ళారు. మరికొందరు లాబ్ సిబ్బంది కూడా వెళ్ళారు.

కిటికీలు తెరిచారు. ఫ్యాను వేశారు.

"స్వామీ, క్విక్! నువ్వు గబగబా ఫోటోలు గుంజెయ్! డాక్టర్, మీరు వెంటనే శవం సంగతి చూసి డిస్పాచ్ చేసెయ్యండి.... కాస్త ఊపిరి పీల్చుకుంటాను" కర్చీఫ్ వెనుక నుంచి గడబిడ చేశాడు కృష్ణన్.

ఫ్లాష్ బల్బు చకచకా వెలిగింది. బోర్లా పడివున్న శవం పృష్ట భాగాన్ని కొన్ని స్నాప్స్ తీశాడు. వెల్లకిలా తిప్పి మరికొన్ని తీశాడు ఫోటోగ్రాఫర్.

అక్కడే గాయముంది కడుపులో. కత్తి పిడికంటా

దిగింది. అతను బనియన్, లుంగీమీద వున్నాడు. అవి రెండూ రక్తసిక్తమయ్యాయి. నేల మీద కూడా రక్తం ప్రవహించి గడ్డ కట్టింది.

అతనికి ముప్ఫయి అయిదేళ్ళుంటాయి. నల్లటి రంగు. అంత దృఢమైన శరీరం కాదు. నెత్తిమీద వెంట్రుకలు పలచగా వున్నాయి. ఎడమ చేతికి రిస్టువాచీ వుంది.

డాక్టర్ శవాన్ని సమీపించాడు.

డిటెక్టివ్‌లు గదిలో తిరుగుతూ దేన్నీ ముట్టుకోకుండా వస్తువులు పరిశీలిస్తున్నారు.

గదిలో శవం తర్వాత ప్రధానంగా ఆకర్షించేది డ్రెస్సింగ్ మిర్రర్.

సరిగ్గా శవం కాళ్ళకి తిన్నగా గోడదగ్గరున్న డ్రెస్సింగ్ మిర్రర్. పై భాగంలో సగంవరకు పగిలిపోయింది. అది అయిదడుగులు ఎత్తు గల అద్దం. కింద పగిలిన అద్దం ముక్కలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఒక జాంబూ సైజు పాండ్స్ టాల్కమ్ పౌడరు డబ్బా వాటి మధ్య పడుంది.

అద్దం పక్కనే కిటికీ వుంది. కిటికీ అవతల పెరట్లోకి పోయే సందు వుంది. కిటికీకి వూచలున్నాయి. మరో కిటికీ ముందు వరండా వైపు వుంది. అక్కడే ఒక డబుల్ కాట్ బెడ్ వుంది. దానిమీద పక్క అస్తవ్యస్తంగా వుంది. ఒక దినపత్రిక, రెండు పుస్తకాలు తలగడ వైపు ఉన్నాయి.

దానికి సరిగ్గా ఇవతలి గోడకి పుస్తకాల రాక్ వుంది. దాని నిండా సైన్సు పుస్తకాలున్నాయి. దాని ముందు టేబుల్, అటొకటీ ఇటొకటీ రెండు కుర్చీలున్నాయి. రెండూ అడ్డదిడ్డంగా వున్నాయి. టేబుల్ మీద చిందర

వందరగా కాగితాలూ, పుస్తకాలూ పడివున్నాయి. రెండు ఖాళీ కప్పు సాసర్లు కూడా అక్కడున్నాయి.

రాక్‌లో కింది వరసంతా 'ఫిరంగి' వార పత్రిక పాత కాపీలతో నిండి వుంది.

అక్కడ్నుంచి చూస్తే వరండా వైపు కిటికీ పైన ఫ్రేము కట్టివున్న ఫోటో ఒకటి వ్రేలాడుతూ కనిపిస్తోంది, కింద ఆధారంమీంచి జరిగిపోయి.

దాని అద్దం పగలేదు.

డాక్టర్ శవం దగ్గర్నుంచి లేచాడు.

కృష్ణన్ వేలిముద్ర[ల]తనికి సూచనలిస్తున్నాను. అతను ఆయా వస్తువులపైన వేలిముద్రలు తీస్తున్నాడు, యూనివర్సల్ గ్రేపౌడర్ జల్లి, ఆటోమైజర్‌తో.

శవం తక్షణం స్ట్రెచ్చర్ మీద తరలించబడింది.

డాక్టర్ డిటెక్టివ్‌లని తీసుకుని గది బైటికి నడిచాడు.

2

అక్కడ ఓ హాలులాటి ప్రదేశంలో కుర్చీలో కూర్చుని ఏడుస్తోంది ఓ యువతి. ఆమె చుట్టూ నల్గురున్నారు. వాళ్ళు ఓదారుస్తున్నారు. ఆమె కుర్చీ పక్కన ఒక సూట్‌కేసూ, ఒక ఏయిర్ బ్యాగూ వున్నాయి.

లాల్ డాక్టర్‌ని ప్రశ్నార్థకంగా చూశాడు. డాక్టర్ అతన్ని పక్కకు తీసుకెళ్ళాడు.

"లాల్, ఈ హత్య మొన్నరాత్రి జరిగివుండాలి. అంటే సుమారు ముఫ్ఫై గంటల క్రితం. ఇప్పుడు ఉదయం తొమ్మిదవుతోంది, బుధవారం. చావు మొన్న సోమవారం రాత్రి జరిగింది....రిగర్ మార్టిస్ పూర్తిగా రిలాక్సయింది. శవం కుళ్ళుతోంది. ఎడమ చేతికి రిస్ట

వాచీ చితికి ఆగిపోయింది, మూడున్నర చూపిస్తోంది సమయం. ఇదే హత్యా సమయం అనుకోవచ్చు. సోమ వారం రాత్రి మూడున్నరకి. చావుకి ముందు చాలా ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది.... ఆ కత్తి మామూలు కూరలు కోసుకునేది. దాని చివర మొనదేలి లేదు. గుండ్రంగా వుంది. కానీ హంతకుడు బలిష్ఠుడయితే సునా యాసంగా దాన్నుపయోగించగలడు. హతుడు బలవంతు డేమీ కాదు.... ఇంతే ఇప్పుడు నేను చెప్పగల్గేది, సెలవు తీసుకుంటాను!"

డాక్టర్ వెళ్ళిపోయాక లాల్ ఆ యువతిని సమీ పించాడు. ఆమెకు ఇరవై ఎనిమిది వుంటాయి. యువతు లంటే సాధారణంగా అందమైన రూపాలే మెదులు తాయి. ఆమె ఫోన్ చేసినప్పుడు ఆమె కంఠం విని లాల్ అలాగే వూహించాడు. కాని వూహకూ వాస్తవానికీ తేడా తెలిసి నీరుగారిపోయాడు. ఆమె అంతటి అనా కారిని అతడెక్కడా చూడలేదు. రంగులేదు, సౌష్టవం లేదు, ముఖంలో కళ లేదు—ఆమె విషాదాన్ని పక్కకు పెట్టి చూసినా,

దేశంలో అనాకారులు కోకొల్లలు. అయితే ఇలాటి అనాకారి వితంతువు అయిందంటే, జాన్ కేమాత్రం జాలి కలగడంలేదు. అతను నిర్లిప్తంగా చూస్తున్నాడు.

లాల్ ఆమెని ప్రశ్నించాడు:

"మీ పేరు సుమతి. కానీ మీవారి పేరు చెప్ప లేదు."

"ప్రభాకరరావు...." ఆమె కంఠం లాల్ని ఆకట్టు కుంటోంది.

"ఏం చేస్తుంటారు?"

"పటేల్ కాలేజీలో లెక్చరర్, బాటనీ లెక్చరర్."

"డిగ్రీ కాలేజీయా?"

"అవును."

"మీరిప్పుడు పూర్నించి వస్తున్నారా?"

"అవును, మావూరు వరంగల్ వెళ్ళి ఇప్పుడే వస్తున్నాను...."

"వెల్, మీవారిని చంపేశారు. ఎవరో హత్య చేశారు. మీరు చదువుకున్నవారు. చక్కగా వ్యవహరించారు. మీరు బస్సు దిగి ఇక్కడ కొచ్చిన వెంటనే శవాన్ని చూసి దేన్నీ కదల్చకుండా, ముట్టుకోకుండా, మాకూ పోలీసులకీ ఫోన్ చేసి ఎంతో మంచిపని చేశారు. ఇప్పుడీ హత్యను పరిశోధించడానికి మా కుపయోగపడే విషయాలు దృష్టిలో పెట్టుకుని మీరు చెప్పండి. మీ కెక్కువ శ్రమ ఇవ్వను, క్లుప్తంగా చెప్పండి."

ఆమె తలూపింది. ఆ తర్వాత నెమ్మదిగా చెప్ప సాగింది:

"నాకేం తెలియడం లేదు....ఆయన్ను ఎవరు చంపుతారు? పరీక్షలయిపోయాక సెలవుల్లో నాతో మావూరు రమ్మంటే రాలేదు. ట్యుటోరియల్ కాలేజీలో ఎంట్రెన్స్ క్లాసులు తీసుకోవాలని ఆగిపోయారు. కోఠిలో భారత్ ట్యుటోరియల్సులో చెప్తున్నారు....సరేనని నే నొక్కదాన్నే పోయాను. నెల రోజుల తర్వాత ఇవ్వాళే వచ్చాను. భోజనం ఆయన నల్గొండ క్రాస్‌రోడ్స్‌లో నాయర్ హోటల్లో చేసేవారు. ఇక్కడికి దగ్గరే.

"ఈ నెలరోజులూ మేం ఉత్తరాలూ రాసుకోలేదు. నేను రాస్తే ఆయన సమాధానమివ్వరని నాకు తెలుసు. ఆయన ఉత్తరాల్ని అసహ్యించుకుంటారు."

"నేను వెళ్ళాక ఇక్కడేమేం జరిగాయో తెలీదు. నేను చాలా ఆదుర్దాపడ్డాను. డిటెక్టివ్ గారూ, మా పెవాటాలో వాళ్ళు మంచివాళ్ళు కారు. ఎప్పుడు మాతో తగవులు పెట్టుకుంటూరు. కొట్లాటకొస్తారు. చాలా చిన్న కారణాలకే! ఒకసారి శర్మ చంపుతానని బెదిరించాడు. ఆయన భార్య మహా గయ్యాళిది. భర్తని ఆమే రెచ్చగొడ్తుంది.... పైగా మావారిని ఎదురుపడి మాటలంటుంది. నన్ను—నన్ను చెయ్యం అని తిడ్తుంది...."

"వాళ్ళెందుకొస్తారు తగవుకి?"

"చాలా చిన్న కారణాలు.... కాలేజీ నడిచేటప్పుడు ఆయన ఇంట్లో ట్యూషన్లు చెప్పేవారు. ఆ స్టూడెంట్లతో తమకు డిస్టర్బ అవుతోందనీ వాళ్ళని మాన్పించాలనీ గొడవ చేసేవారు. పెరట్లో ఇద్దరికీ కలిపి ఒకటే నీళ్ళ టాప్ వుంది. అక్కడా పేచీ. ఇంటి మొత్తానికీ కలిపి మా పోర్షన్లో ఒక్కటే కరెంట్ మీటరుంది. అక్కడా చిక్కులు పెడతారు. ఒకసారి వాళ్ళబ్బాయి పైకి మెట్లెక్కుతూ జారిపడ్డాడు. దానికీ మామీద కొట్లాటకొచ్చారు. ఆ గయ్యాళి ఇల్లు ఊడ్చి చెత్తంతా మా గుమ్మంలో పోస్తుంది! ఒకసారి నీళ్ళబిందె ఎత్తుకొని మెట్లెక్కుతూ కాలు జారితే నేను నవ్వాపుకోలేక పోయాను .... అప్పుడు నా నెత్తిమీద పైనుంచి కుల్లి పాయల పొట్టుపోసింది!

"మేం విసిగిపోయాం డిటెక్టివ్ గారూ. వాళ్ళతో వాదానికిపోతే కొట్టడానికొస్తారు. చంపుతామని బెదిరిస్తారు. మేమంటే అంత పగ దేనికో తెలీదు. ఒకసారి స్టూడెంట్లంతా కలిసి వాళ్ళని హెచ్చరించారు కూడా. అయినా వాళ్ళలాగే చేసేవారు...."

"వాళ్ళని మేం ప్రశ్నిస్తాం. మీరింకా శత్రువులు వున్నారేమో చెప్పండి."

ఆమె ముఖం అదోలా అయిపోయింది. తల దించుకుంది.

"శత్రువులు....ఎవరుంటారో తెలియడంలేదు. ఆయన బయట ఎవరితో గొడవలు పెట్టుకునే మనిషి కాదు. కాలేజీ, ఇల్లూ, పత్రిక తప్ప ఆయనకు మరో వ్యాపకం లేదు—"

"ఏం పత్రిక?"

"ఫిరంగి వారపత్రిక. దానికాయన రెగ్యులర్ కాలమిస్టు."

"అదెక్కడ్నుంచి వస్తుంది?" అడిగాడు లాల్.

"గోల్కొండనుంచి" చెప్పిందామె, "ఏదేళ్ళుగా రాస్తున్నారు. ఆ పత్రిక ధోరణి నాకు నచ్చదు. అందరి రహస్యాలతో ఆటలాడుతూంటారు. అది నాకు నచ్చక పోయినా, పత్రికనుంచి ఆయన ఏ రకమైన చిక్కులూ ఎదుర్కోలేదు. ఆయన రాసే శీర్షిక ప్రత్యేకంగా యే ఒక్కర్నీ ఎత్తి చూపదు."

"డిటెక్టివ్ గారూ, చెప్పడం మరిచాను. శత్రువంటే గుర్తొచ్చింది....పరీక్షలప్పుడు ఆయనొక విద్యార్థిని కాపీ చేస్తోండగా పట్టుకున్నారట, రెండుసార్లు. అతను బీజడ్ సీ ఫైనల్ విద్యార్థి, నాతో చెప్పాడు. పేరు దీపక్ అట. తనని పట్టుకున్నందుకు — కాపీ చేయనివ్వనందుకు అంతు చూస్తానని బెదిరించాడట! అతను చాలా చెడ్డవాడని స్టూడెంట్లంతా చెప్పుకుంటారు. అతని జోలికి యెవరూ పోరు."

"ఇంకా? తర్వాత ఏం చేశాడు?"

"ఆ సాయంత్రం ఇంటికొస్తోంటే బస్టాపులో అడ్డ

గించి కత్తి తీశాడట. కానీ జనం తన్నబోతే పారి పోయాడట! అంతే, మళ్ళీ ఈ నెలరోజుల్లో ఏదైనా జరిగిందేమో తెలియదు...."

ఆమె మళ్ళీ అంది, "నాకిక్కడి విషయాలేమీ తెలియదు! ఆ శర్మ మళ్ళీ గొడవ చేశాడో... ఆ స్టూడెంటు బెదిరించాడో .... వీళ్ళిద్దరు తప్ప ఆయనకు శత్రువులు తోచడంలేదు! వీళ్ళిద్దరు కాకపోతే మరెవరో తెలుసుకుని మీరు పట్టుకోవాలి, డిటెక్టివ్ గారూ! పోలీసులున్నా ప్రత్యేకంగా మిమ్మల్ని పిల్చాను... ఫీజు ఎంతైనా సరే, మీరు చంపిందెవరో సాధ్యమైనంత త్వరగా పట్టుకోండి. అంతవరకు నాకు మనశ్శాంతి వుండదు...."

"ఎంత కాలమైంది మీ పెళ్ళయి?"

"ఎనిమిదేళ్ళయింది...."

"పిల్లలు....?"

"లేరు. తలరాతని తప్పించలేం" అందామె భారంగా.

3

పై వాటాలో శర్మ తలుపు తీసి ఉద్రేకంగా చూశాడు. "ఓహ్, డిటెక్టివ్‌లు, రండి, ఎప్పుడొస్తారా అని చూస్తున్నాను..."

డిటెక్టివ్‌లు లోపలికి వెళ్ళారు.

లోపలి గది తలుపు దగ్గర యాభై ఏళ్ళున్న స్త్రీ కని పించింది. ఆమె వాలకం మర్యాద ఇచ్చే రకంలాలేదు. అయితే ఇప్పుడామె భయం భయంగా ఒదిగి నిల్చుంది.

శర్మకు అరవై ఏళ్ళుంటాయి. ఇనుప ముక్క. అతను పైకి ధైర్యం ప్రదర్శిస్తోన్నా లోలోన కాంప్లెక్స్‌లతో సతమత మవుతున్నాడు.

"హత్య గురించి మీ కెప్పుడు తెలిసింది?" అడిగాడు లాల్.

"ఉదయమే సర్" చెప్పాడు శర్మ. అతని కళ్ళలోకి చూస్తే ఏమేం చెప్పాలో ముందే చర్చించుకుని సిద్ధమైనట్టు తెలుస్తోంది....

"ఈ రెండు రోజులూ మీకనుమానం రాలేదా?"

"లేదు సర్, తాళంవేసి వుంటే ఆయన వూరెళ్ళాడనుకున్నాం."

"హత్య మొన్న రాత్రి జరిగింది. అప్పుడు మీరెక్కడున్నారు?"

"ఇంట్లోనే సర్, నిద్రపోతున్నాను."

"క్రింద మీకేమైనా చప్పుళ్ళు విన్పించాయా?"

"లేదు సర్, ఏమీ విన్పించలేదు."

"లెక్చరర్ గారితో చివరిసారిగా మీరెప్పుడు పోట్లాడారు?"

అతను తీక్షణంగా చూశాడు ఒక్క క్షణం. "చూడండి సర్, మమ్మల్ని ఇందులో కీడ్వకండి. లెక్చరర్ గారి చావుతో మాకు సంబంధంలేదు. మేం పోట్లాడుకున్నాం నిజమే, కానీ దాన్ని మీరు సీరియస్ గా తీసుకోవాల్సిన పనిలేదు, ఎందుకంటే, అది అర్థంలేనిది. తీరి కూర్చుని నా మోస్టు అన్ సివిలైజ్డ్ వైఫ్ పురెక్కిస్తోంటే బుద్ధిలేక వెళ్ళి పోట్లాడాను. బెదిరించాను. నేను సిగ్గుపడుతున్నాను. నా వైఫ్ తృప్తికోసం లెక్చరర్ గారిని దూషించాను, అవమానించాను. అందుకు మనసులో నేనెంత బాధపడ్డానో నాకే తెలుసు...."

"మీ మిసెస్ తృప్తికోసం మీరంతే చేశారా?"

"సర్, నా యీ మోస్టు టైర్ సమ్ లైఫ్ నన్నెం

తయినా లెచ్చరొట్టుగాక, నన్నెంతయినా సాధించనీ గాక, లెక్చరర్ గారిని చంపే పరిస్థితి ఏర్పడితే నేను చావడమో, దాన్ని చంపడమో జరుగుతుందేగాని, అలాంటి పాపపు పని నేను కలలో కూడా తలపెట్టను! ఈ డెవిల్ కోసమే నేనాయనతో దురుసుగా ప్రవర్తించానుగానీ, వ్యక్తిగతంగా ఆయనంటే నాకు చాలా ఇష్టముంది. సదభిప్రాయముంది. మంచి లెక్చరర్ గా, పత్రికలలో కాలమిస్టుగా ఆయనపై నాకెంతో గౌరవముంది. ఎప్పుడైనా బైట దొరికితే చేతులు పట్టుకుని క్షమాపణ కోరుకోవాలనుకున్నవాడిని...."

"నోర్మూయ్యండి!" శర్మ భార్య చేతులూపుతూ ముందుకొచ్చింది, "పొగుడుతున్నారు, పొగడ్డలు! నోర్మూయ్యండి! మంచివాడట మంచివాడు! ఎవరికి తెలీదు ఆ లెచ్చరాయన సంగతీ! ఈ పెద్దమనిషి కేం తెలుసబ్బాయిలూ, పాదసమానం యింట్లో పడుందేదాన్ని నన్నడగండి! అవ్వ! అవ్వ! ఆ లెచ్చరాయనా ఆ బక్క దెయ్యం ఎలా పోట్లాడుకునేవారమ్మా! అవ్వ అవ్వ! ఆ లెచ్చరాయన్ని క్షణం సుఖంగా బ్రతకనిచ్చిందా బక్క దెయ్యం! అస్తమానం అనుమానాలే! తాను అందగత్తె కాదని ఏడుపు! మొగుడు బయట ఏ కుర్రదానితోనో పూరేగుతున్నాడని ఒకటే పోరు! ఇల్లెగిరిపోయేలా అరుపులూ!

"మరి ఆ లెచ్చరాయన వూరుకుంటాడా? విసిగి విసిగి నిజంగానే ఓ కుర్రదాని వెంటపడ్డాడు! ఇది తెలిసి ఆ బక్కదెయ్యం పోట్లాట వేసుకుని పుట్టింటికెళ్ళిపోయింది నెలక్రితం! ఇంకేముందీ, ఆ లెక్చరాయనకు ఎంత స్వేచ్ఛ! ఆ రెండు జడల కుర్రదీ, ఆయనా ఇక్కడే ఇంట్లోనే అర్ధరాత్రుల దాకా ఒకటే పకపకలూ వికవికలూ....

ఏమంటే ట్యూషన్‌లనే సాకు!"

శర్మ కళ్ళల్లో వారించి ఆమె నాపాడు.

డిటెక్టివ్‌లు తేరుకున్నారు. "ఇది కొంచెం వింతగా వుంది. మీరు చెప్పేది నిజమా?"

ఆమె జవాబిచ్చింది విసురుగా. "చమన్లు పంపండి- కోర్టుకొచ్చి ఇంకా గట్టిగా చెప్తాం. మీరక్కడ తట్టుకో లేరని వూరుకుంటున్నానుగానీ...."

"ఆమె పేరేమిటి? ఎక్కడుంటుంది?"

"అది నాకు తెలీదు. కానీ అది టక్కరి కర్రదని తెలుసు."

"మొన్న రాత్రి ఇక్కడుందా?"

"వుంది. మొన్న సాయంత్రం వచ్చి రాత్రి ఎప్పుడు పోయిందో తెలీదు."

"నిన్న వచ్చిందా?"

"నేను చూడలేదు."

"వాళ్ళెప్పుడైనా పోట్లాడుకునేవారా?"

"పోట్లాడుకున్నా బాగుండేది! ఆ పకపకలు.... అబ్బా!...."

"ఆమె ఎలా వుంటుంది?"

"ఆ కర్రది...." అంటూ ఆమె చటుక్కున భర్త వైపు తిరిగింది, "మొన్న మనం సినిమా చూశాం, ఏమిటది?"

"క్రోకడైల్స్ .... నో, నో! కొండళ్ళొస్తున్నారు జాగ్రత్త!"

"అందులో కర్ర కోడలు—ఆ చిన్న కోడలెవరు? అలాగే వుంటుందా కర్రది...."

అతను తల గోక్కున్నాడు. అంతవరకూ తలుపుకు

వేలాడుతూ వింటోన్న ఎనిమిదేళ్ళ కుర్రాడు వెంటనే అన్నాడు. "గీత! ఫోటో వుంది చూపిస్తా!"

అందరూ విస్తుపోయి చూస్తూండగానే, లోపలికెళ్ళి పత్రిక తెచ్చి గబగబా పేజీలు తిప్పి చూపించాడు.

4

"మిష్టర్ లాల్—" కృష్ణన్ అన్నాడు గదిలో చూపిస్తూ, "వేలిముద్రలు ఈ గదిలో చాలా వున్నాయి. అన్ని వస్తువులమీద అవెప్పుడేర్పడ్డాయో చెప్పలేం. అన్ని వస్తువులమీదా వేలిముద్రలు మనకవసరమనుకోను. కానీ ఈ పౌడరు టిన్ను-ఇది అతి ముఖ్యమైన ఎవిడెన్స్. హత్యా సమయంలో ఇది ఉపయోగించబడింది. దీన్ని విసిరికొట్టడంవల్లనే ఆ అద్దం పగిలింది. ఇద్దర్లో యెవరు విసిరారో చెప్పలేం....

"కానీ దీనిమీద ఇద్దరి వేలిముద్రలున్నాయి. హతుడివి, సుమతివి. ఒక పౌడర్ టిన్నుమీద భార్యాభర్తల వేలిముద్రలుండటం అసహజంకాదు. కానీ అవి ఏర్పడ్డ సమయ సందర్భాలు మనకు సందేహాస్పదం. ఇదే మన ఇన్వెస్టిగేషన్‌లో క్లిష్టమైన అంశం."

"అవెప్పుడేర్పడ్డాయో తెలుసుకోలేమా?"

"అది ఎలిబీమీద ఆధారపడి వుంటుంది, మిష్టర్ లాల్. ఆమె ఈ నెల రోజులూ ఇక్కడ లేదని—ముఖ్యంగా మర్డర్ జరిగిన రాత్రి—తన ఊళ్ళోనే వున్నట్టు సాక్ష్యం వుంటే, ఈ టిన్నుమీద ఆమె వేలిముద్రలు ఆమె ఊరికెళ్ళేముందు ఏర్పడ్డవనుకోవాలి.

"ఈ ఎలిబీ ఆమెకు లేకపోతే, అప్పుడీ వేలిముద్రలు మర్డర్ జరిగిన రాత్రే ఏర్పడ్డాయని అనుకోవలసివస్తుంది. అదామెకు ఇన్‌క్రిమినేటింగ్ ఎవిడెన్స్ కానీ ఆమె అంగీక

రించకపోవచ్చు. తనుఊరుకెళ్ళేముందే ఏర్పడాయనవచ్చు. ఇక్కడ బెనిఫిటాఫ్ డౌట్కు అవకాశమూ లేదు. ఈ టిన్నుని తామిద్దరు కలిసి వాడుతున్నట్టు ముందే కమిట్ చేసింది గనుక, ఊరికెళ్ళేముందు ఆమె వేలిముద్రలు దీని మీద వున్నా, భర్త వాడకంలో ఈ నెలరోజులూ అవి చెక్కు చెదరకుండా ఉండటం అసంభవం. భర్త ఈ నెల రోజులూ అసలీ టిన్నుని ముట్టుకోలేదనడం కూడా అసహజంగా వుంటుంది."

"వెల్, ఆమె ఎలిబీని చెక్ చేయండి."

"చేస్తాం. ఇక ఈ కత్తిమీద వేలిముద్రల్లేవు. పిడి శుభ్రంగా వుంది. ఈ కత్తి తమది కాదంటోంది సుమతి. ఇంట్లో వున్న రెండు కత్తుల్ని చూపించింది. ఈ కత్తి వాటికంటే పెద్దగాను, మొండిగానూ వుంది. బ్రెడ్ కోసే కత్తిలా వుంది. ఈ కత్తి యెవరిదో తెలుసుకోవాలి...."

"వైన శర్మ ఇంట్లో కత్తులు చూడండి."

"చూస్తాం. తర్వాత....ఇటు చూడండి, ఈ కప్పు సాసర్ల మీద వేలిముద్రలున్నాయి. ఒకదానిమీద హాతుడివి. రెండోదానిమీద మరొకరివి. మర్డర్ కుముందు కాఫీ చేసుకుని తాగివుండాలి. ఈ అతిథి వేలిముద్రలు ఇంకా చాలా చోట్ల వున్నాయి. ఆ కిటికీమీద, ఆ కుర్చీ మీద, టేబులుమీదా. మిష్టర్ లాల్ బెడ్ మీద కూడా. ఇంకా కిచెన్లో కొన్ని పాత్రలమీదా .... ఈ వేలిముద్రలు మనకు తెలియని వ్యక్తివైనా, హాతునికి ఆ వ్యక్తి కొత్తకాదు. కిచెన్లోకి వెళ్ళగలిగేంత చనువున్న వ్యక్తి."

"అర్థమైంది, ఇంకా?"

"సుమతివి కూడా చాలా చోట్ల వున్నాయి. అయితే

అవన్నీ ఈ టిన్నుమీద అంతగా ఇన్‌క్రిమినేటింగ్ కావు. వాటి అస్తిత్వంపట్ల సందేహాలు కలగవు."

"ఆ అద్దం ముక్కలమీద?" అడిగాడు జాన్.

"వున్నాయి. రెండింటిమీద వున్నాయి. మిగిలిన ముక్కలమీద మరకలూ లేవు. ఆ రెండింటిమీద వేలిముద్రలు నాతునివి. మరో రకం పరాయి వేలిముద్రలు ఈ తలుపుమీద వున్నాయి ..."

"ఇక ఆ గోడకి చూడండి — ఆ ఫోటో ఫ్రేము ఆధారంమీంచి తొలగి వేలాడుతోంది. ఆ అద్దం పగల్లేదు. అదెలా తొలగిందో చూస్తే — ఘర్షణలో వస్తువులు విసురుకున్నప్పుడు ఏదో వెళ్ళి తగిలివుంటుందనిపిస్తోంది. కానీ అప్పుడు అద్దం పగలాలి. బహుశ ఏదో మెత్తని వస్తువు....పుస్తకంలాంటిది తగిలివుంటుంది. అద్దం పగలకుండా అది ఆధారంమీంచి మాత్రమే జారిపోయింది. కానీ దానికి తగిలిన వస్తువేదో కిందపడిపోయిలేదు...."

"ఆ సమయంలో కిటికీలు తెరిచి వుండవచ్చా?" జాన్ అడిగాడు మళ్ళీ.

లాల్ అక్కడ్నుంచి కదిలి నెమ్మదిగా సుమతి వున్న చోటికి వెళ్ళాడు. ఆమె గాభరాగా చూసింది.

లాల్ సూటిగా చూస్తూ అడిగాడు. "మీ వారి గర్ల్ ఫ్రెండ్ ఎవరు సుమతి?"

ఆమె ఉలిక్కిపడింది. లాల్ ఎదురు చూశాడు.

ఆమె అంది తేరుకొని. "వనజ — శాంతినగర్‌లో వుంటుంది, ఇరవైయ్యారో నెంబర్ ఇంట్లో!"

"గుడ్, ఇది ముందే ఎందుకు చెప్పలేదు?"

"ఎలా చెప్పమంటారు?"

"వనజ గురించి మీరు మీ వారితో పోట్లాడి వెళ్ళి

పోయారు."

"అవును. నామీద ప్రేమ తగ్గి ఆమె వెంట పడ్డారు."

"ప్రేమ తగ్గలేదు. మీ ఇన్ ఫీరియారిటీ ఆయన్ని వేధించి విసిగించి ఆ దారి పట్టేలా చేసింది. మీరు పోట్లాడి—బహుశ ఇక రానని చెప్పి ఊరెళ్ళిపోయారు. ఈ విషయం అక్కడెవరికీ చెప్పివుండరు. మీవారిమీద మనసులో కక్షపెట్టుకుని వచ్చి మొన్న కత్తితో పొడిచేశారు—"

"మొన్న రాత్రి నేను మా ఊళ్ళోనే వున్నాను. ఇది రుజువు చేసుకోగలను. నాకే కక్షా లేదు. నేనీ నెల రోజులు బాగా ఆలోచించాను. తప్పు నాదే అన్పించి పశ్చాత్తాప పడ్డాను. నేనెందుకు అందగత్తెని కానని మనసులో మథనపడాలి? ఆ మాట ఆయనెప్పుడూ అనలేదు. ఆయనే నన్నిష్టపడి చేసుకున్నారు. అందువల్ల తిరిగి ఆయనతో మంచిగా వుంటూ నా వైపు తిప్పుకోవాలనే ఉద్దేశ్యంతో వచ్చాను. నేనెలాటి ఆవేశంతో రాలేదు...."

"మొన్న రాత్రి మీరు ఎలిబీ వుంటే, ఇక్కడ ఆ పౌడరు టిన్నుమీద మీ వేలిముద్రలెలా వచ్చాయి?"

"ఇన్ స్పెక్టర్ కూడా ఇలాగే ఆలోచించకుండా అడిగాడు. నేనాయన్ని హత్యచేస్తే, కత్తిమీద వేలిముద్రలు తుడిచినదాన్ని, ఆ టిన్నుమీద తుడవకుండా పోతానా?"

లాల్ శాంతినగర్ లో ఆ యింటికి చేరుకునేసరికి పదకొండున్నరయింది.

ఆమె ఇంట్లోనే వుంది.

తను చూసిన ఫోటోలోలాగానే వుందామె. వయసు ఇరవై మించదు. శర్మ భార్య అన్నట్టు రెండు జడలున్నాయి.

ఆమె వార్త తెలిసి వెక్కి వెక్కి ఏడిచింది. లాల్ ఆమె ఏడుపులోని మాలికతను పరిశీలిస్తున్నాడు. తల్లి ఆమె తల నిమిరింది. లాల్ ఆమెని తేరుకోనిచ్చాడు. అప్పుడన్నాడు, "ప్రేమించడం, అది ఫలించక ఆశోపహతులుకావడం ప్రపంచంలో మామూలే. ప్రేమించడమంత పొరపాటు మరొకటి లేదు. ప్రేమించబడడంలోని హాయి అందులో లేదు. కనుక మనం ఎప్పుడూ స్వీకర్తలుగానే వుండాలి తప్ప దాతలు కాకూడదు—"

"నేనేం దానం చేయలేదు!" అందామె కోపంగా.

"లెక్చరర్ గారికి మీరు మనసివ్వలేదా?"

"ఎవరన్నారు? ఆయన భార్య అంటోంటే అవన్నీ అబద్దాలే. ఆమె అనుమానాలే. ఆయన్ను నేను మా లెక్చరర్ గానే గౌరవించాను. ఆయన కూడా నన్ను విద్యార్థిగానే చూశారు. మరో దృష్టితో నన్నెప్పుడూ చూడలేదు. కొంతకాలంగా ఆయనెందుకో విచారంగా, ఆందోళనగా వుంటూ నాతో చనువు పెంచుకున్నారు. నా సమక్షంలో ఆ వ్యధలన్నీ—అవేమిటో నాకప్పుడు తెలియదు—మర్చిపోయినట్లు కన్పించేవారు. త్వరలోనే మేం మంచి స్నేహితులమైపోయాం. నావల్ల ఆయనకు బాధలు తొలిగితే నాకంతకంటే గర్వకారణమేముంది? కానీ ఆయన భార్య అపార్థం చేసుకుంది మా స్నేహాన్ని."

"మొన్న రాత్రి మీ రెప్పటివరకున్నా రక్కడ?"

"పదిగంటలవరకున్నాను...."

"రోజూ అంత సేపు వుంటున్నారా?"

"లేదు ఎనిమిది గంటలకే వచ్చేసేదాన్ని. ఆలస్యమైతే అన్నయ్య వచ్చేస్తాడు. కోప్పడతాడు. అతనికిది ఇష్టం లేదు. ఒక రోజు గంట ఆలస్యమైందని బాగా కోప్పడ్డాడు. ట్యూషన్ కైతే ట్యుటోరియల్ కాలేజికే వెళ్ళమన్నాడు. మరోసారి ఆలస్యం జరిగితే నేరుగా అక్కడికే వచ్చి లెక్చరర్ గార్ని తిట్టాడు — భార్య ఇంట్లో లేనప్పుడు నా చెల్లెల్ని వుంచుకుంటావా ఇంత రాత్రి — అని. మళ్ళీ అక్కడికెళితే నన్ను కొడతా నన్నాడు. నేను తెలియకుండా మొండిగా పోతూనే వున్నాను. అతను వచ్చేలోగా ఇంటికొచ్చేస్తున్నాను."

"మరి మొన్న పదిగంటలకొస్తే ఏమీ అనలేదా?"

"మొన్న నేను ఇంటికి రాలేదు. ఫ్రెండ్ ఇంటికెళ్ళి పడుకున్నాను. ఉదయం వచ్చాను. సాయంత్రం స్నేహితులతో సినిమాకెళ్ళి వాళ్ళింట్లో పడుకున్నా నన్నాను. నమ్మాడు."

"బాగా నమ్మించారు!" లాల్ అన్నాడు నవ్వుతూ, "మరి నిన్న వెళ్ళలేదా?"

"వెళ్ళాను. కానీ తాళం వుంది. పనిమీద ఎక్కడికో వెళ్ళారనుకొని వచ్చేశాను...."

లాల్ ఆమె మొహంలోకి గుచ్చి చూశాడు. "నిజం చెప్తున్నారా? నిన్న సాయంత్రం మీరక్కడికి వెళ్ళారా?"

"అబద్ధం ఎందుకు చెప్పాలి?"

"మీ అన్నయ్యలా నమ్మించడానికి, మీ అమాయకత్వాన్ని వెల్లడించడానికి. మొన్న మీరక్కడ చాలా రాత్రి వరకు వుండలేదూ? లెక్చరర్ గారితో కాఫీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయలేదూ?

ఆ ఏకాంతం చూసి — ఎదురుగా మీ అందచందాలకి చలించి—లెక్చరర్ గారు చొరవతీసుకుని మీతో అతిగా ప్రవర్తించలేదూ? మీరప్పుడు ప్రతిఘటిస్తూ గదంతా తిరగలేదూ? ఇహ ఓడిపోయే స్థితిలో తెగించి మీరక్కడ టేబులుమీద వున్న పేపర్ నైఫ్‌తో ఆయన్ని పొడవలేదూ?"

ఆమె బిత్తరపోయింది. తల్లి చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"మీరు—మీరు లెక్చరర్ గార్ని అంత నీచంగా భావిస్తున్నారా?"

"అన్ని పరిస్థితుల్లోనూ మనిషి వున్నతంగా వుండలేడు. మీ ఫ్రెండ్ గురించి—ఎవరా ఫ్రెండ్?"

"ముషీరాబాద్‌లో వుంటుంది. నిన్న రాత్రంతా నేనక్కడే వున్నాను."

"భోజనం అక్కడే చేశారా?"

"నేనెక్కడా భోజనం చేయలేదు! లెక్చరర్ గారితో కలిసి ఎనిమిది గంటలవరకే వున్నాను! ఆ తర్వాత పది గంటలవరకు ఒంటరిగా వున్నాను! ఆ తర్వాత—ఆ తర్వాత వచ్చేశాను—"

"మీరక్కడ ఒంటరిగా ఎందుకున్నారు?"

"ఆయన ఎవరితోనో బయటకెళ్ళారు."

"ఎవరది?"

"అతన్ని రెండు మూడు సార్లు చూశాను. ఫిరంగి అనే పత్రిక ఎడిటర్ కుమారుడని చెప్పారు. రవీందర్ అతని పేరు. అతను ఎనిమిది గంటలకి వచ్చాడు, స్కూటర్ మీద. లోపలికి రాలేదు. వాళ్ళిద్దరు బయటే మాట్లాడుకున్నారు. తర్వాత ఆయన వచ్చి నాతో గంటలోగా వస్తానని చెప్పి వెళ్ళిపోయారు. కానీ గంట దాటి

రెండుగంటలైనా రాకపోయేసరికి- నేనుండలేక అన్నయ్య భయానికి—అతనెక్కడొచ్చేస్తాడోనని భయపడి వెళ్ళిపోయాను, కిటికీలూ తలుపులూ మూసేసి, పది గంటలకి తిన్నగా ఫ్రెండ్ యింటికెళ్ళిపోయాను. ఆయనెప్పుడింటికొచ్చారో తెలీదు."

లాల్ కొన్ని క్షణాలవరకు ఆమెనే చూస్తూండిపోయాడు."

"ఇప్పుడు మీ అన్నయ్య ఎక్కడున్నాడు?"

"వూరెళ్ళాడు నిన్న ఉదయమే, విజయవాడకి."

"దేనికి?"

"అతని ఫ్రెండ్ పెళ్ళికి. రేపు సాయంత్రం వస్తాడు."

"పేరేమిటి?"

"జయకర్."

లాల్ ఆమె తల్లిని అడిగాడు. "మొన్న రాత్రి అతనెక్కడున్నాడు?"

"తొమ్మిది గంటలకి వచ్చి ఇంట్లోనే వున్నాడు."

"మధ్య రాత్రి ఎక్కడికైనా వెళ్ళాడా?"

ఆమె తెలీదన్నట్లు తలూపింది. లాల్ లేచాడు.

5

ఎడిటర్ చొక్కారావు లాల్‌ని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు, రెండు కాఫీలకి బాయ్‌ని పంపిస్తూ. యాభై ఏళ్ళుంటాయతనికి. పొట్టిగా లావుగా వున్నాడు. తలమీద చాలావరకు వెంట్రుకలూడిపోయాయి. కళ్ళకు బైఫోకల్ అద్దాలున్నాయి. అతని ముందు టేబులుమీద చాలా కాగితాలూ, ఫరంగి కాపీలూ పడివున్నాయి.

లాల్ వార్త చెప్పేవరకూ అతడు ఉత్సాహంగా వున్నాడు, కుశల ప్రశ్నలు వేస్తూ. వార్త తెలియగానే

తెల్లబోయాడు. లాల్ తేరుకోనిచ్చాడు. వచ్చిన కాఫీ సిప్ చేస్తూ.

"ఇది నేనూహించనిది! నమ్మలేకపోతున్నాను...." అన్నాడతను ఎలాగో.

"పత్రికల వాళ్ళు వార్తలు నమ్మాలి" అన్నాడు లాల్.

"ప్రభాకరరావు ఎంత మంచివాడు! ఆయన్ని చంపే వారెవరుంటారు దుర్మార్గులు .... నేనేం ఆలోచించలేక పోతున్నాను."

"మీ అబ్బాయి రవీందర్ ఆయన్ని కలిసినట్టు తెలిసింది, మొన్న రాత్రి. అతన్ని కొన్ని ప్రశ్నలడగాలి, ఎక్కడున్నాడు?"

చొక్కారావు ఉలిక్కిపడ్డాడు. ఉలికిపాటుని కప్పిపుచ్చుకుంటూ వెంటనే సిగరెట్ ముట్టించుకున్నాడు, లాల్‌కొకటి ఆఫర్ చేస్తూ.

"వాడు—ప్రభాకరరావుని కలిశాడా?"

"అవును, అతన్ని త్వరగా పిలుస్తారా?"

అతను నిదానంగా ఫోనెత్తాడు. "యింట్లోనే వుంటాడు, పిలుస్తానుండండి" అంటూ నెంబర్ తిప్పి రెస్పాన్స్ వచ్చాక మాట్లాడసాగాడు.

లాల్ అతన్నే గమనిస్తున్నాడు.

అతను ఫోనే పెట్టేస్తూ "పది నిమిషాల్లో వచ్చేస్తాడు" అన్నాడు.

లాల్ తలూపాడు. "మీకు తెలిసి ప్రభాకరరావుకు విరోధు లున్నారా?"

"విరోధులా?" చొక్కారావు భుజాలెగరేశాడు. "ఆయన కెవరుంటారు విరోధులు? పత్రికకు సంబంధించి

నంతవరకు వుండే వీలులేదు. ఆయన మా పత్రికకు ఏదే ళ్ళుగా రెగ్యులర్ కాలమిస్టు మిస్టర్ లాల్. మా పత్రిక కొంచెం అతివాద ధోరణులు కలిగివున్నా, ఆయన ఎవరి మీదా యే ఉద్దేశ్యంతోనూ ఆరోపణలు చేయనూలేదు, కించపర్చనూ లేదు. ఏ ఇజాల జోలికి పోయేవారే కాదు. సమకాలీన పరిస్థితుల్ని, నాగరికత పోతున్న వెర్రి పోకడల్ని వ్యంగ్యంగా చిత్రించేవారు. అంతే. బ్లిట్జ్‌కి ఆఖరి పేజి యెలా ఆకర్షణో, అలా మా పత్రిక్కి ఆయన శీర్షిక ఒక ఎస్సెట్."

అతను కాఫీ అందుకొంటూ యింకా చెప్పాడు. "అంతవరకే ఆయన సంబంధం. మేం ప్రచురించే వార్తలతో, మేం ఎదుర్కొనే వివాదాలతో ఆయన కేం సంబంధం లేదు. మా వార్తలు మాకు కొందరు వ్యతిరేకుల్ని సంపాదించి పెట్టింది వాస్తవమే. సరిగా చెప్పాలంటే శత్రువులు లేని పత్రిక మనజాలదంటాను. ఎల్లో జర్నలిజం వర్ధిల్లడానికిదే కారణం - అలాగని మాది ఎల్లో జర్నలిజం కాదు. నిజాల్ని నిర్భయంగా, సభ్యత కలిగిన భాషలో బైటపెట్టే పత్రిక."

అప్పుడొచ్చాడొక పాతికేళ్ళ యువకుడు. అతను జుట్టు బాగా పెంచాడు. తీరుతెన్నులు సినిమా అనుకరణ జాడ్యాన్ని తెలియజేస్తున్నాయి. ముఖభావాలు తీవ్ర మయిన అశాంతినీ, అన్నీ సాధించబోయి యేదీ సాధించ లేకపోయానన్న అసంతృప్తినీ వెల్లడిస్తున్నాయి.

తండ్రి అతనికి లాల్‌ని పరిచయం చేస్తూంటే బెదురుగా చూశాడు. కుర్చీలో యిబ్బందిగా కూర్చున్నాడు.

అప్పుడు చూశాడు లాల్. అతని కుడి చేతికి కట్టు వుంది.

ప్రభాకరరావు మరణవార్త అతన్ని తీవ్రంగా చలింప జేసింది.

"సార్! యిది యెలా జరిగింది? నో, ఆయన పోవడానికి వీల్లేదు. నాన్నా! యేమిటిది? నమ్మలేకపోతున్నాను."

"నేనూ నమ్మలేను" అన్నాడు తండ్రి. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు అనుమానంగా చూసుకొంటూంటే అది గమనించాడు లాల్.

"వెల్, రవీందర్. మొన్న రాత్రి మీరు ఆయన్ను కలుసుకున్నట్టు తెలిసింది. ఆ విషయం మాట్లాడడానికి వచ్చాను."

అతను వులిక్కిపడ్డాడు. "ఆ స్టూడెంటు చెప్పిందా? అవును. మొన్న సాయంత్రం లెక్చరర్ గారు నన్ను రమ్మన్నారు. ఎనిమిదిగంటల కెళ్ళాను. అప్పుడామె అక్కడే వుంది. నేను లోపలికి పోలేదు. ఆయనే బయటకొచ్చారు. అప్పుడు మేమిరువురము కలసి బార్ కెళ్ళాం సార్. మేమిద్దరము కలసి పుచ్చుకుని చాలా రోజులయింది. ఆయన నాతో తప్ప పుచ్చుకోరు. అందుకని రమ్మన్నారు. ఆ అమ్మాయిని యింట్లోనే వుంచి వెళ్ళాం. నల్గొండ క్రాస్ రోడ్స్‌లో రీజెంట్ బార్ కెళ్ళాం సార్.

ఆయన మితిమీరి తాగేశారు. అక్కడే చికెన్ తీసుకుందామన్నాను. కానీ ఆయన వెజిటేరియన్. నాయర్ హోటల్ కే వెళదామన్నారు. అక్కడ్నించి వెళ్ళాం. కానీ సార్, దురదృష్టం."

"ఏం జరిగింది?"

"ఆయన ఓవర్ డోస్‌తో తూలిపోతున్నారు. ఏం

మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియదు. భోజనం చేస్తూ రైస్‌లో రాళ్లొస్తున్నాయని సర్వర్లని తిట్టేరు. అంతటితో ఆగక నాయర్‌నీ పిల్చి తిట్టారు. అతన్నీ, అతని హోటల్నీ దుయ్యబట్టారు. నేను వారించినా వినలేదు. నాయర్ కోపగాడులా వున్నాడు సార్. ఆయన పరిస్థితిని గమనించక ఆవేశంతో చేయిచేసుకో బోయాడు. జనం పట్టి లాగారు. అప్పుడు లోపలి కెళ్ళి కత్తి పట్టుకొచ్చాడు సార్."

"దాంతో యేం చేశాడు?"

"ఏం చేసేవాడో మేం దాన్ని లాక్కున్నాం సార్. నేను లెక్చరర్ గారితో బయటపడి స్కూటర్ ఎక్కాను. మేం వెళ్ళిపోతూంటే నాయర్ అరుస్తూనే వున్నాడు."

"అప్పుడు?"

"అంతే సార్. ఆయన్ని తిన్నగా తెచ్చి యింటివద్ద డ్రాప్ చేశాను. అప్పటికి చాలా రాత్రయింది. పదకొండు కావస్తోంది. అప్పు డా స్టూడెంటు యింట్లో వుందో లేదో చూడలేదు. నేను బయటనుంచే వచ్చేశాను—యివా జన్మకి యీ అనుభవం వద్దనుకొని."

"ఆ తర్వాత రాత్రంతా యెక్కడున్నారు?"

"యింట్లోనే వున్నాను. ఫాదర్ని అడగండి."

తండ్రి తలూపాడు.

"మీ చేతికి గాయం యెలా అయింది?"

రవీందర్ తడబడ్డాడు. "ఇది నిన్న ఉదయం కోసుకుంది అరచేతిలో. మా వంటవాడు ఆలస్యం చేస్తూంటే నేనే పనిలోకి దిగి కత్తిపీటతో కోసుకున్నాను సార్, ఉల్లిపాయలు తరుగుతున్నప్పుడు."

లాల్ వాళ్ళిద్దర్నీ నిశ్శబ్దంగా కొన్ని క్షణాలు గమ

నించి లేచాడు.

“ఆల్ రైట్. అయితే మీ రిద్దరిప్పుడు క్రైమ్ బ్రాంచి కెళ్ళండి. ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ వుంటాడు. అతనికి మీ వేలిముద్ర లిచ్చి స్టేట్‌మెంట్స్ కూడా యివ్వండి.”

వాళ్ళిద్దరి మొహాలు యెర్రబారాయి.

నల్గొండ క్రాస్ రోడ్స్‌లో నాయర్ హోటల్ ముందు కారు దిగేసరికి ఒంటి గంట దాటింది. లాల్ లోపలికి నడిచి కౌంటర్ వెనుక నున్న వ్యక్తిని నాయరుగా గుర్తించాడు. నాయర్ నవ్వుతూ ఆహ్వానించాడు.

కానీ లాల్ వార్త చెప్పగానే నిలువునా వణికిపోయాడు.

లాల్ వణకనిచ్చాడు.

అతను వణుకుతూనే చెప్పాడు. “లేదు సార్, లేదు లేదు! మా కత్తులన్నీ ఇక్కడే వున్నాయి! నేనిక్కడే వున్నాను మొన్నరాత్రి! ఆయన నన్ను తిట్టేస్తోంటే చంపుతానని బెదిరించాను ఆవేశంలో. అప్పటి వుద్రేకంలో ఆ పని చేసేవాడ్నేమో! వాళ్ళంతా ఆపారు కాబట్టి.... సరిపోయింది. లేకపోతే .... ఓహ్, తర్వాత నిదానించి ఆలోచిస్తే ఆయనంత మంచివాడు, మా రెగ్యులర్ కస్టమర్, ఎప్పుడు ఇలా ప్రవర్తించలేదు, తాగేశాడు కాబట్టి ఇలా చేశాడు పోనీయ్ అనుకొని క్షమించేశాను.... నా ఆవేశం అణచుకున్నాను. ఆ గొడవ అప్పుడే మర్చిపోయాను....”

“ఆ రాత్రంతా మీరెక్కడెక్కడున్నారు?”

“పన్నెండు గంటలకి యింటికెళ్ళిపోయాను. మళ్ళీ నాలుగ్గంటలకి లేచి ఇక్కడకొచ్చాను. నా భార్య నడు

కండి! పనివాళ్ళ నడకండి!"

"సరే, మీరిప్పుడు క్రైంబ్రాంచ్ కెళ్ళండి. యిన్స్పెక్టర్ కృష్ణన్ వుంటాడు. మా వేలిముద్రలిచ్చి అతనికి మీ గోడు విన్పించుకోండి!" అక్కడ్నుంచి వచ్చేశాడు లాల్.

6

మధ్యాహ్నం రెండున్నరకి తిరిగివచ్చాడు జాన్.

"పార్ట్నర్, దీపక్ కుమార్ గురించి వింటావా?"

"ఓహో, అతని గొడవ ఏమిటి?"

"గొడవా గలాటా! ఏడ్చి మొత్తుకుంటున్నాడు!" అన్నాడు జాన్ సిగరెట్ వెలిగించుకుంటూ, "అటు పరీక్షపోయింది—ఇటు ప్రాణంమీదకొచ్చింది! ప్రభాకర రావు అతన్ని పట్టుకుంటే బెదిరించాడు. అదే పాయంత్రం బస్టాపులో గల్లాపట్టుకుని కత్తి తీశాడు. కానీ జనం తన్నబోతే తప్పించుకు పారిపోయాడు. ప్రభాకరరావు పోలీసు రిపోర్టివ్వలేదు, ప్రిన్సిపాలుకి కంప్లెయింట్ చేశాడు. ఇది జరిగి నెలా పదిహేనురోజులైంది....

"ఆ తర్వాత పదిహేను రోజులకి—ప్రభాకరరావు ఈవెనింగ్ క్లాసులు తీసుకొంటోన్న భారత్ ట్యుటోరియల్స్ దగ్గరా ప్రయత్నించి విఫలుడయ్యాడట! అక్కడి విద్యార్థులు అంటున్నారు. అప్పటికీ ఇతను పోలీసురిపోర్టు ఇవ్వలేదట. అవి ఉట్టి బెదిరింపులే తప్ప — చంపేవాడయితే అన్నివిధాలా కలిసొచ్చే చోటు తన ఇంటికే వచ్చి చంపేవాడని అనేవాడట. అయితే దీపక్ మొన్న రాత్రి ప్రభాకరరావు ఇంటికెళ్ళాడు...."

"ఇంటికెళ్ళాడా?"

"అవును, మొన్న రాత్రి ఒంటిగంటకి ఆ వీధిలోంచి

పరుగెత్తి పారిపోతోంటే ఊరకుక్క వూరుకోక పడిందట అతని వెంట! అప్పుడా అరుపులకి అర్జున్ సింగ్ అనే ఆ పేటకి చీఫ్ గూండా మేల్కొని అడ్డగించి పట్టుకున్నాడట! ఎందుకు ఉరుకుతున్నావంటే కుక్క వెంట పడిందన్నాడట దీపక్. మన చీఫ్ కుక్కనో కిక్ ఇచ్చి, దీపక్‌కి గ్రీన్ సిగ్నలు ఇచ్చేశాడట! అతను వున్నత కుటుంబానికి చెందినవాడిలా, మర్యాదస్తుడిలా కనిపించడంవల్ల మన చీఫ్‌కి డౌట్స్ రాలేదట—

“కానీ ఇప్పుడు పోలీస్ కస్టడీలో దీపక్ మొత్తుకునేది వేరుగా వుంది. తను చంపడానికి పోలేదనీ, అసలా వుద్దేశ్యం మానుకున్నట్టూ చెప్తున్నాడు. ప్రభాకరరావు పరువుతీసి బుద్ధి చెప్పాలనుకున్నాడట. వనజతో అతని వ్యవహారం తెలుసుకుని వాళ్ళిద్దర్నీ కలిపి మాంచి ఫోటోలు తీసి సరఫరా చేయాలనుకున్నాడట.

“ఈ ఉద్దేశ్యంతో నే మొన్న రాత్రి కెమెరా పట్టుకుని వెళ్ళాడట. కానీ ఇల్లు చీకటిగా వుందట. తలుపులూ కిటికీలూ మూసి వున్నాయట. లోపల చప్పుడూ లేదట. ముందు తలుపు దగ్గరకు వేసివుండడం చూసి, తీసుకుని లోపల అడుగుపెట్టాడట. అలాగే వెళ్ళి టార్చి వేస్తూ పక్క గదిలో శవాన్ని చూశాడట—”

“ఎన్ని గంటలకి?”

“ఒంటిగంటకి.”

“ఒంటి గంటకా?”

“అతనంటున్నాడు. అది చూసి పరుగెత్తాడట వీధిలోకి. అప్పుడా చీఫ్ చేతిలో పడ్డాడట. వాడ్ని వదిలించుకోవడానికి కెమెరా లంచంగా పెట్టాడట. కానీ ఆ చీఫ్ ఇది తిరస్కరిస్తున్నాడు. దొరబాబునుంచి

ఏమీ తీసుకోలేదంటున్నాడు. అతనింటి సోదాలో కెమెరా దొరకలేదు. ప్రస్తుతం వాళ్ళిద్దరు వాదించుకుంటున్నారు...."

"దీపక్ ఒంటిగంటకి శవాన్ని చూశాడా, జాన్?"

"అవునట, పార్టనర్. కానీ తను ఆ పని చేయలేదంటున్నాడు. ఫోటోలు మాత్రమే తీయడానికి వెళ్ళానంటున్నాడు. ఆ సమయంలో అతని దగ్గర అసలు కెమేరానే లేదంటున్నాడు చీఫ్."

"మరి మూడున్నరకు...." లాల్ ఏదో అనబోతూ ఆగిపోయాడు.

ఫోన్ మోగుతోంది.

లాల్ ఎత్తాడు. ఒక వృద్ధ స్త్రీ గొంతు వొణుకుతూ పలికింది అవతలనుంచి. "హలో, డిటెక్టివ్ బాబేనా?"

"అవును...." లాల్ ముఖం చిట్లించాడు.

"డిటెక్టివ్ బాబూ, నేను చెప్పేది జాగ్రత్తగా వినండి...."

"ఎవరు మీరు—ముందు చెప్పండి?"

"అది చెప్పను. మా ఆయనకు తెలిస్తే చంపేస్తాడు. ఆయనకు తెలియకుండా మీకు చెప్తున్నాను .... ఈ రహస్యాన్ని గుండెల్లో పెట్టుకుని వుండలేను. మీరు నా గురించి తెలుసుకునే ప్రయత్నం చేయకండి, డిటెక్టివ్ బాబూ! లేకపోతే మిమ్మల్ని జీవితాంతం అసహ్యించుకుంటాను."

"సరే, చెప్పండి."

"లెక్చరర్ హత్య గురించి....ఆ రాత్రి నేనొకటి చూశాను."

"ఏం చూశారు?"

"మొన్న రాత్రి మా ఆయన నైట్ డ్యూటీకి ఫ్యాక్టరీకెళ్ళిపోయాక నాకేం తోచక కిటికీ దగ్గర కూర్చున్నాను.... ఇంట్లో ఎవరూ లేరు. పిల్లలకి రెక్కలొచ్చాయి. నే నొక్కదాన్నే బిక్కుబిక్కుమంటూ గడపాలి. అప్పుడు డిటెక్టివ్ బాబూ, పన్నెండున్నరకి, లెక్చరర్ గారింట్లో యెవరో కన్పించారు. ఆ చీకట్లో సరిగా కన్పించలేదు. ఆ ఆకారం తలుపు దగ్గర్నుంచి కదిలి గబగబా ప్రక్కనే మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది—"

లాల్ కళ్ళు పెద్దదయ్యాయి. "పైకి అంటే శర్మ పోరన్ లోకా?"

"అవును, డిటెక్టివ్ బాబూ. ఆ మనిషి మళ్ళీ కిందికి రాలేదు. అది శర్మే అనిపించి, గాలికి కిందకొచ్చి పచార్లు చేస్తున్నాడేమో అనుకొని, నేను కిటికీ మూసేసి పడుకున్నాను. పెద్దగా ఆలోచించలేదు. కానీ ఇవ్వాళ ఉదయం జరిగింది తెలిసి.... తెలిసి.... ఈ విషయం మీకు ఉపయోగపడుతుందేమోనని చెప్తున్నాను.

"డిటెక్టివ్ బాబూ, లెక్చరరూ శర్మా ఇద్దరూ రెండు రోజులక్రితమే పోట్లాడుకున్నారు ఇంటికొచ్చే అమ్మాయి గురించి. శర్మ ఏదో అనరాని మాటంటే లెక్చరర్ చెంప దెబ్బ కొట్టారు. అప్పుడు శర్మ—శర్మ చంపుతానని బెదిరించాడు. డిటెక్టివ్ బాబూ, నాకు శర్మమీదే అనుమానంగా వుంది! ఆ రాత్రి—"

లాల్ ఫోన్ పెట్టేసి వేగంగా దారితీశాడు బయటికి.

7

"నో సర్, నో! ఆయన చెంప దెబ్బ తిన్నాక నాకు కనువిప్పయింది. నా మోస్టు అన్ సివిలైజ్డ్ బిహేవియర్ ని

బొద్దివచ్చేలా తిట్టాను...."

"కానీ మొన్న రాత్రి పన్నెండున్నరకి మీరు కిందికి వెళ్ళినట్లు ఇంతకుముందు ఎందుకు చెప్పలేదు?"

లాల్ ప్రశ్నకు శర్మ సందిగ్ధంలో పడ్డాడు.

"సర్, అది తప్పా? కింద ఏదో చప్పుడు విన్పిస్తే వెళ్ళి చూడడం తప్పా?"

"అది మీరు ముందు చెప్పకపోవడమే తప్పు."

"అవును, ఏదో పగిలిన శబ్దమైతే కిందికి వెళ్ళాను. కానీ తలుపులూ, కిటికీలూ మూసివున్నాయి. చీకటిగా వుంది. మళ్ళీ ఏమీ విన్పించకపోతే నాకెందుకని పైకి వచ్చేశాను."

"అలాగా.... మీ ఇంట్లో ఎన్ని కత్తులున్నాయి?"

"రెండున్నాయి...." శర్మ భార్య చేత తెప్పించాడు.

వాటిలో ఒక కత్తిని లాల్ అందుకున్నాడు. "ఇది కొత్తగా వుంది, ఎప్పుడు కొన్నారు?"

"నిన్ననే కొన్నాం."

"ఎందుకు కొన్నారు, ఒకటి వుందిగా?"

"రెండుంటే బాగుంటుందని కొన్నాం."

"లేక ఒకటి పోయిందని కొన్నారా?"

"ఏమన్నారూ? మాకు పూర్వం ఒక్కటే కత్తి వుంది."

"ఇన్‌స్పెక్టర్ మీకో కత్తి చూపించాడా?"

"చూపించాడు. అదెవరిదో మాకు తెలీదు!"

లాల్ అక్కడ్నుంచి కదిలి కిందకొచ్చాడు. బయట కారెక్కుతూ ఎదురింటి కిటికీకేసి చూశాడు. అంతవరకూ అక్కడ వుండి గమనిస్తోన్న ఆమె, చటుక్కున లోపలికి మాయమై పోయింది. లాల్ నవ్వుకుంటూ స్టార్టుచేశాడు.

ఆఫీసుకొచ్చాక జాన్ అన్నాడు.

"కృష్ణన్ ఫోన్ చేశాడు, పార్ట్‌నర్ గంటలో వస్తా నన్నాడు. ముందు నీకీ విషయం చెప్పమన్నాడు."

"చెప్పు."

"కేసులో ఇంతవరకు సంబంధమున్న వాళ్ళంతా వచ్చి వేలిముద్రలిచ్చి స్టేట్‌మెంట్లు ఇచ్చారట. ఒక్క వనజ అన్న జయకర్ తప్ప. అతను వూళ్ళోలేడు. కృష్ణన్ ఎలా అందరికీ మోటివ్స్ వున్నాయో అలా ఎలిబేలూ వున్నాయంటున్నాడు. రవీందర్ అతని తండ్రి ఒకరి కొకరు ఎలిబీ. నాయర్‌కి అతని భార్య. ఇది నిలబడదు. కాని హోటలులో అతని పనివాళ్ళు ఎలిబీ ఇస్తున్నారట. ఇక జయకర్‌కి అతని తల్లి, వనజకు ఆమె ఫ్రెండ్ ఇస్తున్నారు.

"సుమతికి ఆమె ఊళ్ళో ఆమె వాళ్లు సాక్ష్యం వున్నారట. ఎంతవరకు నమ్మదగ్గదో చెప్పలేమంటున్నాడు కృష్ణన్. ఆమెను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అన్పిస్తోందట. సుమతి బుకాయించింది, ఈ నెలరోజులూ తను ఊళ్ళోనే వున్నట్లు. కానీ ఆమె ఇక్కడ అన్న గారింటికి రెండుసార్లు వచ్చిందట. అయితే మొన్న రాత్రి ఇక్కడ లేదంటున్నాడామె అన్న. ఆమె సంసారంలో ఏర్పడ్డ కలతలు తెలుసుకొని అతను ప్రభాకరరావుకి రెండుసార్లు నచ్చజెప్పాడట. అతను ఒప్పుకోలేదట. సుమతి ఇక రావవసరం లేదన్నాడట. ఆమెకు విడాకు లిస్తానన్నాడట. సుదర్శన్ సుమతి అన్న — పరువు ప్రతిష్టలు పోయే అలాటి పని చేయవద్దని ఎంతో బతిమాలుకున్నాడట. అయినా విన్పించుకోలేదట...."

"ఐసీ.... మొన్న రాత్రి అతనెక్కడున్నాడట?"

"ఒంటరిగా సెకండ్ షో కెళ్ళాడట.... మూడున్నరకి ఇంట్లోనే వున్నాడట."

"నో, నాకు పన్నెండున్నరకి ఎలిబీ కావాలి!" ఆవేశంగా ఫోనెత్తాడు లాల్.

డయల్ చేసిన వెంటనే రెస్పాన్స్ వచ్చింది.

"హలో డాక్టర్, ఏమిటి ప్రోగ్రెస్?" అడిగాడు లాల్.

డాక్టర్ అన్నాడు, "పోస్టుమార్టమ్ అయింది, లాల్. కానీ పోస్టుమార్టమ్ ఇంటర్వెల్ ఈ దశలో సరిగ్గా ఇన్ని గంటలని చెప్పలేను. ఉదయం మీకు ముప్ఫై గంటల క్రితమని చెప్పాను — అంటే మొన్న రాత్రి మూడున్నరకు. నేను అటాప్సీ పన్నెండున్నరకి ప్రారంభించాను. ఆ సపోర్టింగ్ ఎవిడెన్స్ — హంతుని చేతికి రిస్టు వాచీ చూపించే టైముని దృష్టిలో పెట్టుకునిగాక — బాడీ కూలింగ్ లివిడిటీ, రిగర్ మారిస్‌ని బట్టి చూస్తే, 2, 3½ గంటలు ఇంకా వెనక్కి పోవాలనిపిస్తోంది.... అంటే పన్నెండు — మూడున్నర గంటలమధ్య ఎప్పుడైనా జరిగివుండవచ్చు."

"వెరీ వెల్, నేనూ అదే అనుకునేది! అయితే ఆల్కహాలు లక్షణాలు కన్పించాయా?"

"ఆల్కహాలా? లేదు లాల్. తీసుకున్నట్లయితే ఈ దశలో చెప్పడం కష్టం. శవం కుళ్ళడం ప్రారంభం కానంతవరకు రక్తంలో ఆల్కహాలు కాన్సన్ట్రేషన్ స్థిరంగా వుంటుంది. ఆ తర్వాత క్రమంగా కనుమరుగవుతుంది. అది తీసుకున్నట్లు ఐవిడెన్స్ లుంటే మీకు చాలు. లేకపోతే చెప్పండి — అప్పుడు ప్రయోగాలు చేయాలి. కార్బోహైడ్రేట్స్‌నీ, ప్రొటీన్స్‌నీ ఎనాలిసిస్

చేయవల్సి వుంటుంది.... ఈ కుళ్ళిన దశలో బాక్టీరియా, ఈస్టు, ఎంజైమ్స్ కలిసి ఉత్పత్తిచేసే ఆల్కహాలు శాతం 0.2 వరకు వుంటుంది, అంతకుమించితే అప్పుడు మరణానికి ముందు ఆల్కహాలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ఓ.కే?"

"నో డాక్టర్, మీకా శ్రమ అక్కర్లేదు. సాక్షులున్నారు."

"అయితే మంచిది. ఇక మీకు కత్తిగురించి చెప్పాలి."

"ఏం చెప్పాలి?"

"రక్తం శుభ్రంచేశాక దానిమీద గీతలు కన్పించాయి. అవి సరికొత్తగా ఏర్పడ్డవి. బ్లేడ్ అంచులు కూడా దెబ్బ తిన్నాయి. దాని మొన గుండ్రంగా వుంది, అది బ్రెడ్ కోసే కత్తి అనుకోవచ్చు. దాన్ని కృష్ణన్‌కిచ్చాడు. అతను లాబ్‌కి పంపాడు, ఆ గీతలేమిటో మైక్రోస్కోప్ కింద తెలుసుకోవడానికి...."

లాల్ సాలోచనగా అడిగాడు. "కత్తి సరికొత్తగా వుందా?"

"లేదు, పాతది. కానీ గీతలు మాత్రం కొత్తగా ఏర్పడ్డాయి."

లాల్ థాంక్స్ చెప్పి పెట్టేశాడు.

8

ఇన్‌స్పెక్టర్ కృష్ణన్ వచ్చాడు సాయంత్రం నాలుగు గంటలకి.

అప్పుడు ముగ్గురూ కూర్చుని తమ తమ పరిశోధనా వివరాలు వెల్లడించుకున్నారు. ఆ తర్వాత పరిస్థితిపై చర్చ ప్రారంభించారు.

"ఫ్రెండ్స్! యిప్పటి వరకు తేలిన అనుమానితులు

తొమ్మండుగురు" క్రిష్ణన్ అన్నాడు సిగరెట్ వెలిగించుకుంటూ. "హంతునికి ఫిరంగి పత్రికతో సంబంధాలున్న దృష్ట్యా యింకెందరున్నారో అనుమానితులు మనకి తెలియకుండా దేవుడెరుగు? ఫిరంగి వ్యవహారాల గురించి నేను కొంత తెలుసుకున్నాను. ప్రతి వొక్క ఆర్టికల్తో కొందరు శత్రువుల్ని ప్రోగుచేసుకుంటోంది దా పత్రిక. కానీ హంతునికి వాటిలో సంబంధం లేదంటున్నాడు దాని ఎడిటర్. అత నెప్పుడూ వార్తలు సేకరించలేదట. స్కాండల్సు వ్రాయలేదట. ఇది యెంతవరకు నిజమో తెలియదు గానీ, అబద్ధమయితే మాత్రం యింకా లెక్కలేనంతమంది అనుమానితులుంటారు మన నెత్తిమీద.

"కానీ ఫ్రెండ్స్, ముందు యిప్పుడు మనకు తెలిసిన అనుమానితుల సంగతి తేలుద్దాం. వీళ్ళలో దోషి లేనట్లు తేలితే, అప్పుడు యీ తెరచాటు వ్యక్తుల సంగతి పడదాం. ఏమంటారు? ఈ తొమ్మిది మందిలో మోటివ్ అందరికీ వుంది వారి వారి ప్రయోజనాల్ని బట్టి. ఇక ఎలిబీలు — వెల్ — అవి యిప్పుడు అందరి విషయంలోనూ అనుమానాస్పదంగానే వున్నాయి. టైమాఫ్ డెత్ యిప్పుడు మారిపోయింది. హంతకుడు లేక హంతకురాలు ఎలిబీని సృష్టించుకోడానికి తన సౌలభ్యం కోసం టైమాఫ్ డెత్ని కొన్ని గంటలు ముందుకి పొడిగించి సూచించడం జరిగింది - హతుని చేతికున్న రిస్టువాచీని మూడున్నరకి తిప్పి డ్యామేజి చేయడం ద్వారా.

"కానీ వాస్తవంలో హత్య కొన్ని గంటలముందే జరిగింది. డాక్టర్ మూడున్నర గంటల పీరియడ్ నిచ్చాడు, పన్నెండు నుంచి మూడు ముప్పై వరకు అని. దాన్ని మనమింకా కుదిద్దాం. దీపక్ ఒంటి గంటకు వెళ్ళి శవాన్ని

చూశానంటున్నాడు. కానీ అంతకు గంట క్రితమే శర్మ కింద శబ్దాలు విని వచ్చానంటున్నాడు. కాబట్టి హత్య పన్నెండూ పన్నెండున్నరల మధ్యలో జరిగి వుంటుందని భావించాలి.

"ఈ అరగంట వ్యవధిలో మనం ఎలిబీలు చూస్తే కొందరికి వున్నాయి. కొందరికి లేవు. లేని వాళ్ళని అలా వుంచుదాం. ఉన్నవాళ్ళని చూస్తే అవెంతవరకు నిజమయిన ఎలిబీలన్నవీ అనుమానాస్పదమే. అసలు ఎలిబీల గురించి ఆలోచించే ముందు సర్క్యుమ్‌స్టేన్‌షియల్‌గా యీ కేసు యెంతవరకు నిలబడుతుందన్నది చూడాలి.

"ఈ అరగంట వ్యవధిలో ఆ యా అనుమానితుల స్థాన చలనాలు అనుమానాస్పదంగా వున్నంత మాత్రాన వాటిని హత్యాస్థలానికి సంధించలేం. అలా చేస్తే ఒకరి కంటే యెక్కువ మందిని సంధించవలసి వుంటుంది. కానీ అక్కడ నేరం చేసింది అందరిలో యే వొక్కరో, కాబట్టి మై డియర్ ఫ్రెండ్స్, ఈ కేసులో సర్క్యుమ్‌స్టేన్‌షియల్ యెవిడెన్స్ పనికిరాదు. అంత కంటె పటిష్టంగా, నిర్దుష్టంగా వుండే మెటీరియల్ యెవిడెన్స్ అవసర మున్నది" చెప్పాడు కృష్ణన్.

"మెటీరియల్ ఎవిడెన్స్........" లాల్ అన్నాడు సాలోచనగా. "అదెక్కడా నాకు నిర్దుష్టంగా కన్పించడం లేదు. ముఖ్యంగా హత్యాయుధమే యే క్లూ ఇవ్వలేకపోయింది. దానిమీద వేలిముద్రలు లేవు. అదెక్కడ్నుంచి వచ్చిందో తెలుసుకోలేకపోయాం. ఆ కత్తి యిళ్ళల్లో వాడే రకంలా లేదు. శర్మ అది తమది కాదు అంటున్నాడు. నాయర్ కూడా అలాగే అంటున్నాడు. కానీ అది హోటల్లలో ఉపయోగించే కత్తి లాగానే

వుంది—

"వెల్. ఆ కత్తి యెవరిదయినా అది బయటనుంచే వచ్చింది. ఆ వచ్చిన హంతకుడు—సారీ—అనుమానితులలో యిరు లింగాల వారూ ఉన్నారు కాబట్టి దోషి అనడం బాగుంటుంది. వెల్, ఆ వచ్చిన దోషి హత్య చేసే ఉద్దేశ్యంతో నే ఆ కత్తి పట్టుకొని వచ్చినట్టు అనిపిస్తోంది. అంతేగాని వున్నట్టుండి మామూలుగా వున్న పరిస్థితి విషమించి క్షణికావేశంలో జరిగిన హత్యలా అనిపించడం లేదు. ఎందుకంటే అప్పుడు అందుబాటులో కత్తి యెక్కడ వుంటుంది? అది పేపర్ నైఫా? కాదు, అక్కడే టేబుల్ మీద వుందనడానికి! ఆ కత్తి సొంతదారుని కనుక్కుంటే ఈ కేసు క్షణంలో తేలిపోతుంది.

"మరో ఎవిడెన్స్—పౌడరు టిన్ను, దానిమీద వేలిముద్రలు. ఆ వేలిముద్రల గురించి సుమతి దొక వివరణ వున్నది. కత్తి మీద వేలిముద్రలు తుడిచినదాన్ని ఆ టిన్నుమీద తుడవకుండా పోతానా అని. అది నే నంగీకరించను. నేరం చేసిన మనిషి ఆధారాలన్నీ తొలగించాలని లేదు.

ఆమె వాదన నాకు నచ్చడంలేదు. ఆమె విషయాలు దాస్తోంది. మోటివ్ బలంగా తోస్తోంది. భర్త యెవరి మాటా వినక విడాకుల ఆలోచన పెట్టుకున్నాడు. అలాటి భర్త మరో యువతితో సుఖపడకూడదనుకొని వుంటుంది. ఆమె అన్నగారింట్లో రెండు సార్లు గడిపిన విషయం కూడా దాచింది. అన్నతో జరిపించిన రాయబారాలు కూడా దాచింది. యెందుకు దాచింది? మనం మోటివ్ వ్రూహిస్తామనా? ఆమెపైన ఎలిబీని అనుమానిస్తామనా? ఆమె ఎలిబీని వెరిఫై చేయండి కృష్ణన్."

"అలాగే, లాల్."

లాల్ అన్నాడు: "ఇక వనజ అక్కడ పది గంటల వరకే వున్నా నంటోంది. రవీందర్ ప్రభాకరరావుని పదకొండు గంటలకి యింటి బయటే డ్రాప్ చేసి వెళ్ళి పోయా నంటున్నాడు. వనజ తన స్నేహితురాల్ని సాక్ష్యం చూపిస్తోంది. కానీ ప్రభాకరరావు వచ్చేవరకు ఆమె అక్కడే వుంటే, అప్పుడతను తాగిన మైకంలో ఆమె మీద దాడి జరిపి వుంటే ఆమె దుస్తులు చాలా విషయాలు చెపుతాయి. అవి మనం పరిశీలించలేదు. మొన్న రాత్రి ఆమె ఏ బట్టల్లో వుందో తెలుసుకొని వాటిని పరిశీలించాలి కృష్ణన్. అలాగే ఆమె వొంటిని లేడీ డాక్టరు చేత పరీక్ష చేయించాలి."

"ఓ. కే. లాల్!"

"ఇక ఆమె అన్న జయకర్ కు తల్లి ఎలిబీ యివ్వలేక పోతోంది. అతను నిన్న ఉదయం పెళ్ళికి విజయవాడ వెళ్ళిపోయాడు. మోటివ్ ఎంతో వుంది. అతని వేలి ముద్రలు దొరకలేదు. కానీ ఎలిబీ యెలా యిచ్చు కుంటాడో చూడాలి. ఆ పెళ్ళి నుంచి అతను యెటూ వెళ్ళిపోకుండా చూడండి కృష్ణన్. కత్తి పట్టుకు వెళ్ళిన దోషిగా అతను చక్కగా కుదురుతాడు.

"మరో సస్పెన్స్. దీపక్ వేలిముద్రలు తలుపు మీద దొరికాయన్నారు. అతను కత్తిపట్టుకెళ్ళాడో, కెమెరా పట్టుకెళ్ళాడో యింకా తేలలేదు. అతన్నీ, అతన్ని పట్టు కున్న రౌడీని నాలుగు తగలనిస్తే తప్ప నిజం తెలిసేలా లేదు. వాళ్ళిద్దరి వ్యవహారం త్వరగా తేల్చాలి కృష్ణన్.

"మరో రకం వేలిముద్రలు — వనజవి కప్పు సాసర్ మీద, మరో కొన్ని చోట్లా వున్నాయన్నారు. సుమతివి

టిన్నుమీద వున్నాయి. దీపక్ వి తలుపుమీద వున్నాయి. ఒకేచోట యిందరి అనుమానితుల వేలిముద్రలతో మనం ఎక్కడికీ పోలేం! ఏదీ సాధించలేం! కేసులో మీ రడిగే నిర్దుష్టమయిన యెవిడెన్స్ నా కెక్కడా కన్పించడం లేదు."

"కానీ లాల్, రవీందర్ చేతికి గాయమయింది."

"అవును. కత్తిపీట కోసుకుందన్నాడు నిన్న ఉదయం. దానికి వంటవాడు సాక్ష్యం చెప్తున్నాడు. తండ్రి ఎలిబీ యిస్తున్నాడు. వేలిముద్రలు మనకు దొరక లేదు. తను ప్రభాకరరావుని బయటనుంచే డ్రావ్ చేసి వెళ్ళిపోయాడనడానికి యిదో ఆధారం. మోటివ్ మనకి తెలీదు. కానీ ఈ హత్యను అతడు చేసివుంటే, అతను ముందు చూపుతో చేశాడనుకోవాలి. కానీ దాన్ని నిరూపించేందుకు మనకు ఆధారాలు లేవు."

"ముందు చూపుతో యెలా చేస్తాడు?"

"నాయర్ హోటల్లో ప్రభాకరరావు గొడవ పడ్డప్పుడు యెవరికీ తెలియకుండా ఆ కత్తిని అక్కడ్నించి తస్కరించి తెచ్చి వుండాలి. దాంతో ప్రభాకరరావుని పొడిచి, ఆ నేరాన్ని నాయర్ మీదకు నెట్టాలనుకుని వుండాలి. ఆ పొడిచే టప్పుడే యెలాగో చెయ్యి కోసుకుని వుండాలి. కేవలం వూహిస్తున్నాం. అతనికి చంపే అవసర మేమిటి?

"మీ రన్నట్టు హత్య పన్నెండు - పన్నెండున్నర మధ్య జరిగితే, రవీందర్ చేసి పారిపోతే, ఒంటి గంటకి దీపక్ వెళ్ళినప్పుడు తలుపు లెలా తెరిచి వున్నాయి? తర్వాత తాళం యెలా పడింది? తాళం వేసిన మనిషి వేరొకరా? ఇంపాసిబుల్. హత్య చేసినవాడే తాళం వేసి వెళ్ళి

పోవాలి. దీపక్ ఒంటి గంటకి యింట్లోకి వెళ్ళి శవాన్ని చూశాననడం అతన్నే చిక్కుల్లో పడేస్తుంది తప్ప, రవీందర్‌ని యిరకాటంలో పెట్టదు."

ఫోన్ మోగింది.

జాన్ ఎత్తి విని కృష్ణన్ కిచ్చాడు. "మీకే, లాబ్ డైరెక్టర్ నుంచి."

కృష్ణన్ అందుకొని మాట్లాడాడు. రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేశాడు.

"ఏమిటి?" అడిగాడు లాల్.

"ఆ కత్తిమీద గీతలు. అవి సన్నని వెంట్రుకవాసి మందంలో వున్నాయట. అవన్నీ కత్తిమైన వయిపుకే నిలువు గీతలుగా యేర్పడ్డాయట. బ్లేడు సగ భాగం వరకు అవి వ్యాపించాయట. అక్కడి వరకు కత్తి ఇరు వయిపులా అంచులు ఎగుడు దిగుడుగా వున్నాయి. సమతలంగా లేవట. కత్తి దేనితోనో రాపిడికి గురయి దెబ్బ తిన్నదట. ఇంకా బ్లేడు, పిడి కలిసే భాగంలో సన్నని మట్టి రేణువులు యిరుక్కుని వున్నాయట."

"మట్టి రేణువులా?"

"అవును. మట్టి రేణువులు."

లాల్ చెంప రుద్దుకుంటూ జాన్ కేసి చూశాడు. "కత్తిమీద గీతలు....మట్టి రేణువులు .... ఓ.కే., జాన్, నువ్వు డాక్టర్‌ని కాంటాక్టు చెయ్యి ఫోనుమీద!"

జాన్ డాక్టర్‌ని కాంటాక్టు చేసి రసీవర్ని లాల్ చేతి కిచ్చాడు.

"హలో, డాక్టర్. ఆ కత్తిమీద లాబ్ రిపోర్టు అందింది. బ్లేడు మీద గీత లున్నాయి. పిడిలో మట్టి రేణువులు యిరుక్కున్నాయి. ఈ రెండింటికీ సంబంధం

మీరు ఊహించుకోగలరు. కానీ నాకో సందేహం వచ్చింది డాక్టర్! నే నా గాయం గురించి తెలుసుకోవాలి!"

"ఏం తెలుసుకోవాలి?"

"దాని పూర్తి డేటా — డైమెన్షన్స్. గాయం లోతు, పొడవు, వెడల్పు వగైరా. ఇంకా గాయంలో ఫారెన్ బాడీస్—అంటే మట్టిరేణువుల్లాంటివి వుంటే ఆ వివరాలు కూడా కావాలి.

"మిస్టర్ లాల్! దీనికి రేడియోపక్ ఇంజక్టు చేసి ఎక్స్‌రే తీయాలి. టైము పడుతుంది."

"ఎంత?"

"రెండు గంటలు పట్టవచ్చు."

"సరే, యెదురుచూస్తాను."

ఫోన్ పెట్టేసి లాల్ కళ్ళు మూసుకున్నాడు.

"ఏమిటి లాల్, మీ రేం చేస్తున్నారు?" అడిగాడు కృష్ణన్.

"నన్ను ఆలోచించుకోనివ్వండి. నే ననుకున్నట్లే డాక్టర్ రిపోర్టు వచ్చిందా, మనం దోషికి చాలా చేరువయిపోతాము. నే ననుకున్నది తప్పుకూడదు."

జాన్ అన్నాడు కృష్ణన్‌తో, "ఆ కత్తి ఎవరిదో తెలుసుకోనట్లే, యింటికి తాళం వేసిం దెవరో కూడా తెలుసుకోలే మనుకుంటాను."

"హత్య చేసిన మనిషే తాళం వేయాలి."

"మరి ఒంటి గంటకు దీపక్ యింట్లోకి యెలా వెళ్ళగలిగాడు? రెండే రెండు అవకాశా లున్నాయి. దీపకే హత్యచేసి ఒంటి గంటకి తాళం వేసుకొని వెళ్ళిపోయి వుండాలి. లేదా అంతకు ముందే మరెవరో చంపి పారి

పోయి వుండాలి. తర్వాత దీపక్ వచ్చి వెళ్ళిపోయాక, తిరిగి వచ్చి తాళం వేసి వుండాలి."

"తిరిగి వచ్చి వేస్తారా! ఏ మవసరం?"

"ఎవరో దూరంగా వుండేవారయితే ఆ అవసరం వుండదు. కానీ ఒకే యింట్లో వుండే వాళ్ళకయితే అవసరం. కొన్ని అవాంతరాల్ని, కొన్ని చిక్కుల్ని తప్పించుకొని నిమితపడడానికి కొంత వ్యవధి అవసర మవుతుంది. అంతవరకు శవం బయట పడకూడదు."

"ఆ పని ఎవరు చేస్తారు?"

"పై వాటాలో శర్మ చేయవచ్చు. పన్నెండున్నరకి పైకి ఉరుకుతూ యెవరో కన్పించారట ఎదురింటామెకు. అది శర్మే కావచ్చు. అతనే పొడిచి పైకి పారిపోయి వుండొచ్చు కంగారుగా. తర్వాత నిదానపడి ఆలోచించి ఆధారాలు తొలగించడానికి వచ్చి వుండొచ్చు, ఒంటి గంట తర్వాత. అప్పుడతనే తాళం వేసుకుని పోయి వుండొచ్చు.

"అంతే! ఆ కత్తి అతనిదే కావాలి. దాన్ని కూర గాయలు తరగడానికొక్కటుండా అవుట్ డోర్ లో ఉపయోగిస్తూ వుండాలి."

"అవుట్ డోరా?" కృష్ణన్ అడిగాడు.

"మొక్కలు నాటడానికి, పాదులు తీయడానికి. ఆ మట్టిరేణువులూ, గీతలూ యేమిటనుకున్నారు? అత నింట్లో కొత్తగా తీసిన పాదుల్ని చూస్తే తెలిసిపోతుంది. ఆ మట్టిరేణువుల సహాయంతో తవ్విన ప్రాంతం అదేనని తెలుసుకోవచ్చు."

"పోండి, జాన్!"

"ఎందుకు పోవాలి?"

"శర్మకు పెరడే లేదు. అతను పై వాటాలో వుంటు న్నాడు.

జాన్ కోపంగా చూశాడు.

కృష్ణన్ పకపకా నవ్వాడు.

లాల్ కళ్ళు తెరిచాడు. "నవ్వకండి ఇన్‌స్పెక్టర్. నా కో విషయం చెప్పండి."

కృష్ణన్ నవ్వాపుకుని "అడగండి!" అన్నాడు.

"ఆ గదిని మీరు సీలు చేశారా?"

"మొత్తం యింటికే తాళం వేశాను. ఆమె అన్నగారింటికి వెళ్ళిపోయింది."

"అయితే పదండి! ఆ యింట్లో మనకు పనుంది."

"ఏం పని?"

"ఒక అనుమానం తీర్చుకోవాలి."

"ఏమిటా అనుమానం?"

"అక్కడే తెలుస్తుంది. ఆ అద్దం ముక్కలన్నీ గదిలోనే వున్నాయా?" అన్నాడు లాల్ లేస్తూ.

9

ఆ గది తెరిచి ముగ్గురూ లోపలికి వెళ్ళారు.

గది వదిలి వెళ్ళినప్పుడు యెలా వుందో, యిప్పుడూ అలాగే వుంది యథాస్థితిలో.

ముగ్గురూ ఓ మూల కుప్పగా పోసివున్న గాజు పెంకుల వద్దకు నడిచారు.

అందులో పెద్ద ముక్కల్ని ఏరి పక్కన పెట్టారు.

అప్పుడు డ్రెస్సింగ్ మిర్రర్‌ని నేలమీద పడుకో బెట్టారు.

దాని పగిలిన భాగంలో ఒక్కో ముక్కని తీసి అవె

క్కడ రావాలో అక్కడ అతికినట్టు అమర్చసాగారు.

పెంకులన్నీ అయిపోయాయి. కానీ మధ్యలో ఒక చోట ఖాళీ ఏర్పడింది. మళ్ళీ మూలనున్న చిన్న చిన్న ముక్కలు తెచ్చి ఆ భాగంలో పెట్టి చూశారు. వాటి ఆకారాలు కుదరక అక్కడ సరిపోలేదు.

లాల్ తల విదిలిస్తూ లేచాడు.

"లేదు, ఇక్కడ ఒక టే పెద్ద ముక్క వుండాలి. ఇరువై పులా మొనదేలి. తొమ్మిదంగుళాలు పొడవు, మూడంగుళాల వెడల్పుతో, చేప ఆకారంలో వుండాలి- వెతకండి!"

"గదిలో ఎక్కడా లేదు!" కృష్ణన్ అన్నాడు.

"వెల్, ఇలాగే వుంచి ఈ ఖాళీ భాగాన్ని కాగితం మీద ట్రేస్ చేయండి! ఆ ముక్క ఆకారం, సైజు తెస్తాయి...."

కృష్ణన్ లేచి, కాగితం కోసం టేబులు దగ్గరికి వెళ్ళాడు.

లాల్ ఫోన్ దగ్గరికి వెళ్ళి ఒక నెంబర్ తిప్పాడు. కాస్సేపట్లో రెస్పాన్స్ వచ్చింది.

"డాక్టర్, నేను లాల్ ని."

"ఓహ్ లాల్, మీ ఆఫీసుకి ఫోన్ చేశాను—"

"మేమిక్కడున్నాం, హత్యాస్థలంలో."

"అక్కడేం చేస్తున్నారు?"

"డాక్టర్, ఆ ఎక్స్‌రే ఏమైంది?" లాల్ ఎదురు ప్రశ్న వేశాడు అసహనంగా.

"ఎక్స్‌రేలో హత్యాయుధం గురించి అనుమానాలున్నాయి, లాల్."

"గుడ్, చెప్పండి."

"గాయం ఏదో మొనదేలిన వస్తువుతో అయింది. కానీ కత్తి మొన గుండ్రంగా వుంది. పెద్ద పేగుని కత్తి కంటే వెడల్పయిన వస్తువు చీల్చింది. ఆ వస్తువు కత్తి కంటే దళసరియైనది కూడా. గాయంలో ఫారెన్ బాడీస్ ఏవీ లేవు—"

"వెల్, నేనదే అనుకున్నాను."

"ఏమనుకున్నారు?"

"గాయం అద్దం ముక్కతో అయుండాలని, కత్తి తర్వాత వచ్చి అందులో ఇరుక్కుందని—"

"థాంక్ గాడ్!"

"వెల్, మీ సహాయానికి చాలా థాంక్స్ డాక్టర్."

లాల్ ఫోన్ పెట్టేస్తుంటే, కృష్ణన్ అరిచాడు. "ఇటు రండి, లాల్!"

లాల్ ఆ గదిలోకి నడిచాడు. కృష్ణన్ ఉద్రేకంగా కన్పించాడు. అతని చేతిలో ఏదో కాగితం ముక్క వుంది. దాన్ని లాల్ కిచ్చి, "నేను తెల్ల కాగితం కోసం చూస్తుంటే, పాడ్ కింద ఇది దొరికింది!" అన్నాడు.

"దస్తూరీ ప్రభాకరరావుదే.... ఏమిటది?" అన్నాడు లాల్, దానిమీద కొన్ని పేర్లనూ, వాటి పక్కన మరి కొన్ని మారు పేర్లనూ చదువుతూ.

"ఆ జోగ్లేకర్ అలియాస్ అశోక్‌రాయ్ పెద్ద చీట్!" అన్నాడు కృష్ణన్.

"ఐసీ....ఏం చేస్తుంటాడు?"

"ఇతనికో ముఠా వుంది, చీటింగ్ గ్యాంగ్ అని వ్యవహరిస్తూంటాం. మొత్తం ఎనిమిదిమంది వున్నారు. ఇంటర్ స్టేట్ ఆపరేటర్స్. అనేక నగరాల్లో పెద్ద పెద్ద

వ్యాపారస్థుల్ని వంచిస్తుంటారు."

"ఎలా?"

"ముందు జోగ్లేకర్ ఏ బొంబాయికో, కలకత్తాకో బయల్దేరతాడు. మారువేషాలు వేయడంలో అతను ఘటికుడు. అక్కడ పెద్ద పెద్ద వ్యాపారస్థుల్ని పరిచయం చేసుకుంటాడు. హైదరాబాదులో తనకు ఫలానా వ్యాపారముందని చెప్తాడని, తను ఓ బిజినెస్ మాన్‌గా సమర్థవంతంగా నటిస్తాడు. తన హోదా, దర్పం ప్రదర్శిస్తాడు. ఇంకా మాటలతో ఆకట్టుకొని వాళ్ళని వశపర్చుకుంటాడు.

"అప్పుడు హైద్రాబాద్ నుంచి మిరపకాయలో, జొన్నలో అక్కడికి ట్రెయిన్‌కి బుక్ చేసినట్లూ, అవి రవాణా అవుతున్నాయనీ, ఒకటి రెండు రోజుల్లో చేరుకుంటాయనీ చెప్పి బేరం మొదలుపెడతాడు. మర్కెట్ రేటుకంటే తక్కువ ధర చెప్తాడు. ఇంకా కమీషన్‌లు వగైరా డిస్కౌంట్‌లు ఎర చూపుతాడు. ఇంకా మొత్తం డబ్బు వెంటనే చెల్లించనవసరం లేదంటాడు. సగం ఇప్పుడు, మిగతా సగం సరుకు అందాక అంటాడు. ఈ షరతులకి ఆకర్షితులై ఎవరో ఒకరు ఆ రైల్వే కన్‌సైన్‌మెంటుని తీసుకోవడానికి ఉత్సాహపడతారు. సగం డబ్బిచ్చేసి రైల్వే రశీదులు తీసుకుంటారు. అంతే, అక్కడికి బేరం ముగుస్తుంది....

"కానీ ఒకటి రెండు రోజులు..వారం పదిరోజులు... నెలా....రెండు నెలలూ గడిచినా సరుకు చేరే సూచన లుండవు! స్టేషన్ చుట్టూ తిరిగి వాళ్ళు తెలుసుకునేదేమిటంటే, అసలా సరుకు రైలుకి బుక్ చేయనేలేదు! ఆ

ఆ రశీదులు ఫోర్జరీవనీ!"

"ఎంత కాలంనుంచి సాగుతోంది?"

"రెండేళ్ళనుంచీ. వాళ్ళంతా వంచనా శిల్పంలో ఆరి తేరినవాళ్ళు. ఒక్కొక్కడు ఒక్కొక్క పనిలో నిపుణుడు. దాదాపు అన్ని రాష్ట్రాల పోలీసులూ వాళ్ళని గాలస్తున్నారు. కానీ యింతవరకు ట్రాప్ చేయలేక పోయారు."

"ఇప్పుడీ ప్రభాకరరావు వాళ్ళ ఆరాలు తీశాడా?"

"అలాగే అనిపిస్తోంది ఆ లిస్టుని చూస్తే! అతను తప్ప కుండా వాళ్ళ ఫోటోగ్రాఫ్స్ సేకరించాడక్కడ! అదే అతనికి ప్రమాదం తెచ్చి పెట్టింది."

"వెల్, అయితే యిప్పుడు సులభం! కమాన్, హత్యాయుధం వెతుకుదాం! లాల్ బయటకు దారి తీశాడు టార్చి పట్టుకుని. ఏడు కావస్తోంది. బయటంతా చీకటిగా వుంది. అతను కాంపౌండ్ గోడ వారగా నడుస్తూ, అక్కడున్న పూల మొక్కల్ని వంచి చూస్తూ, టార్చి కాంతిలో నేలని పరిశీలిస్తున్నాడు.

"అక్కడేముంది?"

"అద్దంముక్క. అదే హత్యాయుధం!" అంటూ అతను ఒక చోట ఆగిపోయి బంతిపూల మొక్క దగ్గర కూర్చున్నాడు. "యిక్కడే. యిక్కడ మట్టి త్రవ్వినట్టుంది" అని కట్టెపుల్ల అందుకుని గబగబా త్రవ్వసాగాడు.

జాన్ పక్కన కూర్చుని మట్టిని తీయసాగాడు.

"జాగ్రత్త. అది తగిలితే ముట్టుకోకు. కర్చీఫ్‌తో పట్టుకో!"

అడుగులోతు త్రవ్వాక జాన్ కర్చీఫ్‌తో పట్టుకుని దాన్ని వెలుపలికి తీశాడు.

కృష్ణన్ ఉద్రేకంగా అరిచాడు. "అద్దం ముక్క. యిది యిక్కడికి యెలా వచ్చింది?"

లాల్ దాన్ని అందుకుని టార్చి వెలుగులో పరిశీలించాడు. చేప ఆకారంలో తొమ్మిదంగుళాల పొడవున్న ఆ అద్దంముక్క ముప్పాతిక వంతు రక్తం అంటుకుని ఆరిపోయి గట్టిపడి వుంది. అతను నోటితో వూది మట్టిని తొలగించాడు. అప్పుడు చూశాడు. అతని కళ్ళు మెరిశాయి.

"ఇట్సెడామ్ పర్‌ఫెక్ట్ ఎవిడెన్స్!" అన్నాడు జాగ్రత్తగా కృష్ణన్ కిస్తూ. "ఆ కత్తిమీద గీత లేర్పడ్డాయని చెప్పినప్పుడు, పిడిలో మట్టిరేణువులు యిరుక్కున్నాయన్నప్పుడు నాకొకటే బలంగా తోచింది కృష్ణన్. ఆ కత్తి యెక్కడో తవ్వకానికి ఉపయోగించబడింది. యెక్కడ తవ్వారనేది కాదు ముఖ్యం, యెందుకు తవ్వారనేది కావాలి. యింకా యెప్పుడు తవ్వారనేది కూడా ముఖ్యం. యెప్పుడు తవ్వారు? ఆఫ్‌కోర్స్, హత్యకు తరువాత. యెందుకు తవ్వారు? ఎవిడెన్స్‌ని దాచడానికి. ఏమిటా ఎవిడెన్స్? అప్పుడే నాకు ఆ అద్దం ముక్కలు స్ఫురించాయి. అది క్షణికావేశంలో జరిగిన హత్య ఎందుక్కాకూడదు? అప్పుడు కత్తి అందుబాటులో వుండదు. అద్దం ముక్కతో యెందుకు పొడవకూడదు? అలా అనుమానించాను.

"వెల్, ఈ అనుమానంతో డాక్టర్ సహాయం కోరి, ఇక్కడికి వచ్చాను అద్దం ముక్కల్ని చూద్దామని. అనుకున్నట్టే ఒకటి తక్కువ వుంది. డాక్టర్ రిపోర్టు కూడా నేను అనుకున్నట్టే వుంది. హత్య యీ అద్దం ముక్కతో జరిగింది. కానీ దీన్ని అలాగే వదిలేస్తే తనని పట్టిస్తుంది

కాబట్టి, మన దృష్టిని మళ్ళించడానికి దాన్ని తొలగించి కత్తి కోసం వెళ్ళడం జరిగింది. కత్తి తెచ్చుకొని ముందు క్కడ తవ్వి ఈ అద్దం ముక్కని పాతిపెట్టేసి అప్పుడు కత్తిని తుడిచి ఆ గాయంలోకి దింపి వెళ్ళిపోయాడు."

"ఎవరు? యెవరు చేశారు యీ పని?"

"దాన్ని జాగ్రత్తగా చూడండి తెలుస్తుంది. ఆ రక్తం మరకలో కూడా వుంది. బొటనవేలిముద్ర అచ్చొత్తి నట్లుంది. మీరు సేకరించిన వేలిముద్రలతో దాన్ని టాలీ చేసి చూడండి. హంతకుడు దొరికిపోతాడు!" అన్నాడు డిటెక్టివ్ అక్కడ్నుంచి కదుల్తూ.

"వెల్ .... వెల్ .... వెల్! పగిలిన అద్దం పట్టిచ్చింది!" అరిచాడుజాన్ అతన్ని అనుసరిస్తూ.

10

రవీందర్ తండ్రి వంక భయంగా చూశాడు.

తండ్రి అసహనంగా చూసి పెరిగిపోతూన్న కోపంతో టీపాయ్ మీద కొట్టాడు. "అసలేం జరిగిందో చెప్పరా సన్నాసీ! ఆ చేతికి కట్టు ఏమిటి? డిటెక్టివ్‌తో అబద్ధం యెందుకు చెప్పావు?"

రవీందర్ ఉలిక్కిపడి చేతిని చూసుకున్నాడు. దాన్ని నిమురుకుంటూ తల దించుకున్నాడు.

"నా కొంపలు ముంచేలా వున్నావురా!"

"నేనేం ముంచలేదు నాన్నా!"

"అయితే యేం చేశావో చెప్పి ఏడవరా?"

"మరి నన్ను రక్షిస్తావా నాన్నా!"

"నిన్ను రక్షించడానికే కదరా నేను కన్నది?"

"లేదు. నువ్వు కనలేదు. అమ్మ కన్నది. నువ్వు చెడ గొట్టావు. అమ్మ వుంటే నే నిలా అయ్యేవాడ్నా?"

"నేను నిన్ను చెడగొట్టానా?"

"మరి నీ బుద్ధులు నా కొన్నూంటే నన్నా పే డెవరు? అమ్మ వుంటే నాకీ రోజు పెళ్ళికూడా అయిపోయేది. మర్యాదగా బ్రతుకుతూ వుండేవాడ్ని. నీకు నా గురించి ఏ పట్టింపూ లేదు."

"సరే....సరే....నీ పెళ్ళి త్వరలోనే చేసేస్తానుగానీ, ఏం జరిగిందో ముందు చెప్పి ఏడ్వరా సన్నాసీ!"

క్షణ మాలోచించి "సరే చెప్తాను" అన్నాడు రవీందర్ అలాగే నిల్చుని. "మరి నన్ను రక్షించాలి నాన్నా! నీ క్షేమం కోసమే చేశాను యీ పని! నువ్వు నా మీద ఒక బాధ్యతను వేశాక దాన్ని పూర్తి చేయడానికే యీ పని చేయవలసి వచ్చింది. నాకేం తృప్తిగా లేదు. ఇలా చేయవలసివ స్తుందనుకోలేదు. చీటింగ్ గ్యాంగ్ గురించి నీకు తెలుసు కదా, నాన్నా? ఆ వ్యవహారంలో ప్రభాకర రావుని ఒప్పించే బాధ్యత నా మీద వేశావు—"

"అవును.... నెల పైనే అయింది" అన్నాడు తండ్రి మధ్యలో. "ఆ గ్యాంగ్ వ్యవహారాల్లో ఆసక్తి కలిగి ప్రభాకరరావు ఫోటోలతో సహా వివరాలు సేకరించి మనకు పంపాడు. అదే అతని మొదటి రిపోర్టు. దాంతో ఆ గ్యాంగ్ మొత్తం క్షణాల్లో పట్టుబడడం ఖాయం!"

"ఖాయం!" రవీందర్ అందుకున్నాడు, "అతనికి అంత గొప్ప పనిచేసే ఆలోచన ఎందుకు కలిగిందో అంత రిస్కు తీసుకుని, ఎలా సాధించాడో మనకు తెలియదు. కానీ నువ్వు మాత్రం నెల కావస్తోన్నా ఆ రిపోర్టుని పత్రికలో వేయకుండా జాగుచేస్తూ వచ్చావు. అతను అడుగుతోంటే, అదుగో వచ్చేస్తుంది—ఇదిగో వచ్చేస్తుందని మభ్య పెట్టావు. అసలు నీ ఉద్దేశ్యం వేరు! ఆ

రిపోర్టుని ముందు ప్రచురించకుండా దాన్నాధారంగా ఆ ముఠాని బ్లాక్ మెయిలు చేద్దామనుకున్నావు, చాలామందిని చేస్తున్నట్లుగానే.

"ఆ గ్యాంగ్ చిత్రంగా నీకు లొంగిపోయింది. పదివేలు గుంజావు, మొన్న పదిరోజుల క్రితం. ఇక రిపోర్టు వేసే ప్రశ్నే లేదు! ప్రభాకరరావు మాటిమాటికీ అడుగుతోంటే, వేయకపోతే తిరిగి ఇచ్చేయమంటోంటే, నచ్చచెప్పలేక కిందామీదయ్యావు. అతన్ని ఒప్పించే బాధ్యత నాకిచ్చావు—"

"ఇచ్చానురా! అయితే నువ్వేం చేశావు?"

"నువ్విచ్చిన రెండు వేలు పట్టుకుని పోయాను అతని దగ్గరికి. మొన్న సాయంత్రం వెళ్లాను. అతన్ని బార్ కి తీసుకెళ్ళి బాగా తాగించి, యింటికి తెచ్చి పని ముగించుకోవాలనుకున్నాను. కానీ అతను నాయర్ హోటల్లో గొడవ పడటం వల్ల కొంత ఆలస్యం జరిగింది. మేమింటికొచ్చేసరికి ఆ స్టూడెంటు లేదు. తలుపు గొళ్ళెం పెట్టి వెళ్ళిపోయింది. నేను స్కూటర్ని లోపలికి పోనిచ్చి కాంపౌండ్ లో ఆపాను. అప్పుడు పదకొండు అవుతోంది. మేం యింట్లో కెళ్ళాం. అతను బట్టలు మార్చుకుని తన ఆర్టికల్ విషయం ఎత్తేవరకు ఆగాను. అప్పుడు పన్నెండు గంటలకి ఆ ప్రస్తావన వచ్చింది, చాలా సేపు నాయర్ గురించే మాట్లాడుకున్నాక!"

"ఏమడిగాడు?"

"అదింకెపుడొస్తుందని! కానీ నాన్నా, నేను సంకోచిస్తూనే చెప్పాను—అతడెలా రియాక్టు అవుతాడోనని-ఆ ఆర్టికల్ ఎక్కడో పోయిందని! అతను ఉగ్రుడయ్యాడు. ఎలా పోయిందని ఉరిమాడు. పొరపాటున

చిత్తు కాగితాలతో కలిపి తగలెట్టారని చెప్పాను—"

"ఏమన్నాడ్రా?"

"రెచ్చిపోయాడు, నాన్నా! కుర్చీలోంచి లేచి తిట్లు లంకించుకున్నాడు! నిన్నూ నీ స్టాఫ్‌నీ చెడామడా తిట్టి పోశాడు! శాంతపర్చి, అందుకే నష్టపరిహారం ఇద్దామని వచ్చాననన్నాను. డబ్బుతీసి ముందుపెట్టాను. దాన్ని చూస్తూ ఆలోచనల్లో పడ్డాడు. అప్పుడు నువ్వు చెప్పినట్లే తెల్ల కాగితం, కలంకూడా తీసి ముందుపెట్టాను. డబ్బు తీసుకుని ముట్టినట్లు సంతకం పెట్టమన్నాను. అంత డబ్బుని చూసి ఆ మైకంలో ఆ పని చేసేస్తాడనే అనుకున్నాను. అప్పుడా బ్లాంక్ పేపరుమీద మనకనుకూలమైన మేటర్ వ్రాసుకుని, ఈ బ్లాక్ మెయిల్‌లో అతను కూడా భాగస్థుడని రుజావుచేసే పత్రం సృష్టించవచ్చు. మళ్లెప్పుడైనా ఆర్టికల్ గురించి గొడవపెడితే, ఆ నోట్ చూపించి అతని నోరు నొక్కవచ్చు. అంతే కదా నాన్నా, నువ్వనుకున్నది?"

"అవున్రా, అయితే ఏం చేశాడు?"

"పసిగట్టేశాడు నాన్నా, అంత మైకంలోనూ! ఆ కాగితం, కలం విసిరేసి, నోట్లకట్టల్ని కిటికీకేసి గిరా వాటేశాడు! కిటికీ అప్పుడు మూసివుంది. లేకపోతే బయిటికి వెళ్ళిపోయేవి. ఒకటి రెక్కలకు కొట్టుకుంది, మరొకటి పైన ఫోటోకి వెళ్ళి కొట్టుకుని కిందపడింది. అప్పుడు నామీద పడి పీక పుచ్చుకున్నాడు, నాన్నా!"

"నువ్వేం చేశావురా?"

"కళ్లు తేలవేశాను, నాన్నా! ఊపిరాడలేదు! నన్నింత మోసంచేస్తావా రాస్కెల్ అంటూ నా గొంతు వదల్లేదు. ఆర్టికల్ పోయింది అబద్ధం, దాన్ని దాచిపెట్టి

బ్లాక్ మెయిల్ చేస్తున్నారు వాళ్ళని, నీ బాబు సంగతి నాకు తెలీదనుకోకు, మొదట్నుంచీ నాకనుమానంగా వుంది. ఇప్పుడు నిజమైందంటూ నా గొంతును పిసికేయ సాగాడు. నేనెలాగో అతన్ని తోసేశాను. అప్పుడు అద్దం దగ్గరకి దూకి పౌడరు డబ్బా అందుకున్నాడు. దాన్ని నా మీదికి విసరబోతే చుట్టూ తిరిగి అద్దం దగ్గర కొచ్చాను. అది వచ్చి అద్దానికి కొట్టుకుంది. అద్దం ముక్కలై కిందపడింది! అప్పుడతను వచ్చే సంచికలో ఆర్టికల్ రాకపోతే, పోలీసులకి ఫోన్ చేస్తానన్నాడు."

"అలా అన్నాడా!"

"అవున్నాన్నా! ఎంత ప్రమాదమో చూడు! అలా ఫోన్ చేశాడంటే, ఆ ముఠావాళ్ళు డబుల్ క్రాస్ చేస్తారా అని మనమీద వచ్చి పడతారు కదా నాన్నా? రక్తపాతం జరుగుతుంది. ఎంత ప్రమాదమో చూశావా? అందుకని నేనొక్కటే ఆలోచించాను. మనం బ్రతకాలంటే అతను బ్రతక్కూడదు! వెంటనే అతనిమీదికి లంఘించి కడుపులో ఒక్క పోటు పొడిచాను—"

"ఓరి—ఓరి—"

"ఆగు నాన్నా, ఆగు అంతా విని నా తెలివిని మెచ్చుకో! అతన్ని పొడిచింది అద్దం ముక్కతో. మరేదీ దొరకలేదు. నా చెయ్యి కోసుకుంది! వెంటనే రక్తం కారకుండా కర్చీఫ్‌తో అదిమిపట్టాను. అతను కిందపడి తన్నుకుని ఇట్టే చచ్చిపోయాడు, నాన్నా! నాకప్పుడు గాభరా పుట్టుకొచ్చింది! పారిపోదామనుకున్నాను. కానీ అప్పుడే బయట మెట్లమీదనుంచి అడుగులు వినిపించాయి. వెంటనే లైట్లార్పేసి చీకటి చేశాను. ఆ మనిషి తిరిగి పైకి వెళ్ళాక వేగంగా ఆలోచించాను—"

"ఏం ఆలోచించావురా, భడవా! నా కొంప ముంచావు!"

"లేదు నాన్నా, నన్నెవరూ పట్టుకోలేరు! అతని కడుపులో అద్దం ముక్కని అలాగే వదిలేసే నా చేతిని చూసి వాళ్ళనుమానిస్తారు. అద్దం ముక్కతో హత్య జరిగిందని వాళ్ళకి తెలియకూడదు! అందుకని కత్తి కోసం ఇంట్లో చూశాను—కానీ ఇంటి కత్తికంటే మరొకరిదైతే బాగుంటుందనుకున్నాను. అప్పుడు నాయర్ గుర్తుకొచ్చాడు. వెంటనే అతని హోటలుకెళ్ళి ఎలాగైనా ఒక కత్తిని సంపాదించుకున్నాను. స్కూటర్ ని కాంపౌండు వారగా చీకట్లో పెట్టి, నడిచి వెళ్ళిపోయాను. కానీ అక్కడ హోటలు మూసివుంది—ఏం చేయాలో పాలుపోలేదు. ప్రక్కనే ఇరానీ హోటలు కన్పించింది. అక్కడికెళ్ళి రెండు కేకులు పార్సిలు కట్టిస్తూ, కౌంటర్ మీద వున్న బ్రెడ్ కోసే కత్తిని తీసేసుకున్నాను—

"అంతే నాన్నా, తిరిగి ఇంటికొచ్చేటప్పటికి ఒంటిగంటన్నరయింది. గబగబా వాకిట్లో కత్తితో గొయ్యి తవ్వి, ఆ అద్దం ముక్కను తెచ్చి అందులో పాతిపెట్టేశాను. కత్తిని గాయంలోకి దింపాను. అక్కడ నాకు సంబంధించిన ఆధారాలన్నీ తొలగించి, అతని చేతిగడియారంలో టైముని మూడున్నరకి పెట్టి డ్యామేజ్ చేసి, యింటికి తాళంవేసి, తాళంచెవిని విసిరేసి, స్కూటర్ ని నెట్టుకుంటూ దూరంగా తీసుకెళ్ళి స్టార్టు చేసుకుని వచ్చేశాను, నాన్నా!"

తండ్రి అలాగే చూస్తూండిపోయాడు కొడుకుని.

"హత్య చేయవలసి వస్తే నేనీ బిజినెస్ వదిలివేయాలనుకునేవాడ్ని. నువ్వు చేసేశావు! నాకు సమస్యలు

తెచ్చిపెట్టావు! ఇప్పుడు నిన్ను కాపాడుకోవాలి! ఆ గ్యాంగ్ బారినుండి కంటే పోలీసులనుంచి కాపాడుకోవటం కష్టమని నీకు తెలియదట్రా, సన్నాసీ!"

"అనూహ్యం నాన్నా, అలా జరిగిపోయింది!"

"అక్కడ నువ్వేమీ ఆధారాలు వదల్లేదుగా?"

"లేదు—అన్నీ తీసేశాను. నువ్వు ఎలిబీ ఇస్తావు. వంటవాడు ఈ గాయానికి సాక్ష్యం ఇస్తాడు. అంతవరకు నాకు ప్రమాదం లేదు, నాన్నా. వాళ్లు ఎందర్నో అనుమానిస్తున్నారు. పనిగట్టుకుని నా ఒక్కడి గురించే ఆలోచించే అవకాశం నేనివ్వలేదు... నామీద వాళ్ళ దృష్టి మళ్ళదు. నాకు మోటివ్ ఏమని వూహిస్తారు నాన్నా?"

రవీందర్ ఛాతీ ఎగరేసి గర్వంగా నవ్వాడు.

తండ్రీ కొడుకులు మాటల్లోపడి బయట ఏం జరుగుతోందో గ్రహించలేదు.

ఇన్స్పెక్టర్ కృష్ణన్ తన బలగంతో అప్పుడే జీపు దిగి ఇంట్లోకి కూడా వచ్చేశాడు. అప్పుడుగానీ తెలుసుకోలేదు వాళ్ళిద్దరూ. కృష్ణన్‌ని చూస్తూనే బెదిరిపోయారు. మాటలాపేసి బొమ్మల్లాగుండిపోయారు.

కృష్ణన్ నవ్వి వాళ్ళని విష్ చేశాడు. అతను మాటలతో ఇబ్బంది పెట్టక, అద్దం ముక్కతీసి గర్వంగా చూపించాడు.

తండ్రి కళ్ళు తేలవేశాడు.

రవీందర్ గావు కేక పెట్టి పడిపోయాడు.

మర్నాడు పత్రికలలో ఈ వార్త వచ్చింది.

లెక్చరర్ హత్యకేసు-స్థానిక పత్రికాధిపతి కుమారుని అరెస్టు.

—:అయిపోయింది:—